
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



శ్రీపొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
మంగళవారం, 6 ఆగస్టు 2024

నేటి నుంచి 'హర్ ఘర్ తిరంగ'


నెల్లూరు (హరనాథపురం) : ఆజాది కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం నుంచి 13వ తేదీ వరకు జిల్లాలో హర్ ఘర్ తిరంగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఎగ్జిబిషన్, బుధవారం ర్యాలీలు, 8న డ్రాయింగ్, పెయింటింగ్, చర్చా వేదికలు, పోస్టర్ మ్యాకింగ్ తదితర అంశాలపై పోటీలు ఉంటాయని తెలిపారు. 9న సాంస్కృతిక కార్యక్రమాలు, 10న స్వాతంత్ర్య సమరయోధుడు వీవీ గిరి జయంతి నిర్వహణ, సాయంత్రం హారతులు, 11న వారసత్వ నడకలు, 12న క్రీడాపోటీలు, 13న జాతీయ పతాకంతో సెల్ఫీలు తీసుకోవడం వంటి కార్యక్రమాలు ఉంటాయని, ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండాను రెపరెపలాడించాలని ప్రజలను కోరారు.

మేమూ మీ వాళ్లమే సార్!

- మళ్లీ మాకు అవకాశం ఇవ్వండి
- మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ వివాదాస్పద అధికారులు
- జిల్లాలో తిష్ఠ వేసేందుకు వైసీపీ వీరభక్తుల ప్రయత్నాలు
- ఇప్పటికే పలువురికి లభించిన హామీ!
- జిల్లాస్థాయి అధికారుల బదిలీలపై కొలిక్కిరాని కసరత్తు

'మేమంతా మీ వాళ్లమే సార్.. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలు మా గొంతుమీద కత్తిపెట్టి మాచేత తప్పులు చేయించారే తప్ప మేము ఉద్దేశపూర్వకంగా ఏమీ చేయలేదు. జిల్లాలోనే పని చేసేందుకు మళ్లీ మాకు అవకాశమివ్వండి.. మీరు చెప్పినట్లు వింటాం..' అంటూ పలువురు వివాదాస్పద అధికారులు, వైసీపీ వీరభక్త అధికారులు ప్రస్తుత మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు పూర్తికావడంతో ఆర్డీవోలు, డీఎస్పీలు, జిల్లా స్థాయి పోస్టులపై కసరత్తులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కొందరు జిల్లాలో పాగా వేసేందుకు ఆర్థిక, రాజకీయ బలాన్ని ఉపయోగిస్తున్నారు. కీలకమైన పోస్టులకైతే విపరీతమైన డిమాండ్ ఏర్పడింది.





నెల్లూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో వివక్షకు గురైన సమర్థవంతమైన అధికారులకంటే కీలక పోస్టుల్లో పనిచేసి వైసీపీ భక్తులుగా ముద్ర వేసుకున్న అధికారులే ఇప్పుడు ఎక్కువగా మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్ల వద్ద దర్శనమిస్తున్నారు. ఇప్పటికే రెండు దఫాలు జరిగిన జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేల ఉమ్మడి సమావేశంలో జిల్లాస్థాయి పోస్టుల వ్యవహారం చర్చకు వచ్చింది. కానీ అన్ని పోస్టులపై ఏకాభిప్రాయం కుదరలేదని సమాచారం. కీలకమైన జడ్పీ సీఈవో, డీఆర్డీఏ పీడీ, డీపీవో, డ్వామా పీడీ, సివిల్ సప్లయిస్ డీఎం వంటి పోస్టులకు సంబంధించి కొందరు అధికారులకు లెటర్లు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. అయితేగత ప్రభుత్వంలో విచ్చలవిడిగా పనిచేసిన అధికారులు కూడా ఈ జాబితాలో ఉండడం గమనార్హం. ఈ కోవలోనే మరికొంత మంది నుడా వీసీ, ఆర్డీవో వంటి కీలక పోస్టుల కోసం తీవ్రంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. అలానే ఇంజనీరింగ్ శాఖలైన ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్‌లలో కీలక ఎస్ఈ, ఈఈ పోస్టులకూ గట్టి పోటీ నెలకొంది.

● వీరభక్తులకు పోస్టింగిస్తారా?

పంచాయతీల పాలనలో జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) పోస్టు చాలా కీలకమైనది. సచివాలయాల వ్యవస్థ కూడా ఈ శాఖ పరిధిలోనే నడుస్తోంది. గత ఐదేళ్లలో పంచాయతీలు నిర్వీర్యమైపోయాయి. ఇప్పుడు పంచాయతీల పాలనపై ఎన్డీయే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ సమయంలో ఓ వివాదాస్పద వైసీపీ వీర భక్త అధికారికి డీపీవో పోస్టు కట్టబెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతు న్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో ప్రకాశం జిల్లా జడ్పీ సీఈవోగా పని చేసిన సదరు అధికారి జడ్పీటీసీ ఎన్నికల్లో వైసీపీ వైపు ఏకపక్షంగా వ్య వహరించి అన్ని స్థానాలూ ఏకగ్రీవమయ్యేందుకు కృషి చేశారు. అలానే అక్కడ భారీగా నిధులు దుర్వినియోగం చేశారు. సా ర్వత్రిక ఎన్నికల్లోనూ వైసీపీకి అనుకూలంగా పని చేసేందుకు కుట్రలు చేసిన నేపథ్యంలో ఒంగోలులోని టీడీపీ నేతలు హైకోర్టును ఆశ్ర యించారు. దీంతో సదరు అధికారి సెలవుపై వెళ్లారు. ఇప్పుడు ఆ అధికారి జిల్లాకు వచ్చేందుకు మార్గం సుగుమం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అలానే ఇద్దరు డీఎల్‌డీవో స్థాయి అధికారులు కూడా కీలకమైన జడ్పీ సీఈవో, డీఆర్‌డీఏ పీడీ పోస్టులను రిజర్వు చేసుకున్నట్లు సమాచారం. ఈ ఇద్దరు నాడు విచ్చలవిడిగా వ్యవహరించారు. ఓ అధికారి తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో ఎన్నికలకు ముందు ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఇ ప్పుడు మళ్లీ వారు జిల్లాలో తిష్ఠ వేసేం దుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో పనిచేస్తున్న మరో వివాదాస్పద వైసీపీ వీరభక్త అధికారి నుడా వీసీ పోస్టులో కూర్చునేందుకు గట్టిగా ప్రయత్నాలు సాగించారు. ఇద్దరు ఎమ్మెల్యేల మద్దతు కూడా సంపాదించినట్లు సమాచారం. అయితే ఉమ్మడి సమావేశంలో ఈ ప్రతిపాదనను మంత్రి పొంగూరు నారాయణ తోసిపుచ్చినట్లు తెలిసింది.

● భిన్నంగా ప్రభుత్వ ఆలోచన

ఆర్డీవో, డీఎస్పీ, జిల్లాస్థాయి వంటి కీలక పోస్టుల విషయంలో ప్రభుత్వ ఆలోచన భిన్నంగా ఉంది. గత ప్రభుత్వంలో వివక్షకు గురైన సమర్థవంతమైన అధికారులకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలకు సూచించింది. జిల్లా నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు ఉమ్మడిగా నిర్ణయించి కొందరి అధికారుల పేర్లు ప్రతిపాదించినా ప్రభుత్వ స్థాయిలో ఈ జాబితాపై స్క్రూటినీ జరుగుతోందని సమాచారం. డీఎస్పీ, సీఐల పోస్టింగ్‌లే ఇందుకు ఉదాహరణగా చెప్పుకుంటున్నారు. ప్రతి ఎమ్మెల్యే వారి పరిధిలోని పోస్టులకు సంబంధించి కొన్ని పేర్లను ప్రతిపాదించారు. కానీ ఇది జరిగి నెల రోజులు గడుస్తున్నా ఇంత వరకూ ప్రభుత్వ స్థాయిలో ఫైనల్ కాకపోవడం గమనార్హం. ఈ జాబితాలో కొందరు వైసీపీతో అంటకాగిన డీఎస్పీలు, సీఐలు కూడా ఉండడంతోనే పోస్టింగ్‌లు ఆలస్యమవుతున్నట్లు పోలీసు శాఖలో చర్చించుకుంటున్నారు. నాలుగు రోజుల క్రితం ఎటువంటి వివాదాలు లేని కొంత మందికి మాత్రమే పోస్టింగ్ ఇవ్వడం గమనార్హం.

పోర్టు, రైల్వేలైన్‌కు

భూసేకరణ వేగం పెంచండి

● ఫిషింగ్ హార్బర్ త్వరగా పూర్తి చేయాలి ● కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు ఆదేశం




కలెక్టర్ల సమావేశంలో దిశానిర్దేశం చేస్తున్న సీఎం, డిప్యూటీ సీఎం, పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (ఆంధ్రజ్యోతి), ఆగస్టు 5 : జిల్లాలోని రామాయపట్నం పోర్టు, నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ నిర్మాణానికి భూసేకరణలో వేగం పెంచాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో సీఎం అధ్యక్షతన సోమవారం జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ హాజరయ్యారు. ఎన్డీఏ ప్రభుత్వ ప్రాధాన్యాలు, లక్ష్యాలను ఈ సందర్భంగా కలెక్టర్లకు ముఖ్యమంత్రి వివరించారు. పాలనలో వ్యవహరించాల్సిన తీరు, చేపట్టాల్సిన ప్రాధాన్య అంశాలపై దిశ నిర్దేశం చేశారు. కాగ ఈ కాన్ఫరెన్స్‌ను జిల్లాలో ఉన్నతాధికా రులంతా వీక్షించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వీడియోకాన్ఫరెన్స్‌కు అధికారులంతా హాజరై ముఖ్యమంత్రి సందేశాన్ని తిలకించారు. జిల్లాలోని పోర్టు, రైల్వేలైను భూసేకరణతోపాటు ఫిషింగ్ హార్బర్ నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 2047 నాటికి ప్రపంచంలో ఏపీ నెంబర్‌వన్‌గా ఉంటుందని సీఎం తెలిపినట్లు కలెక్టర్ వెల్లడించారు. అనంతరం శాంతిభద్రతలపై జరిగిన చర్చలో కలెక్టర్‌తోపాటు ఎస్పీ కృష్ణకాంత్ పాల్గొన్నారు.

తల్లికి వందనం..

పిల్లల్లో సంబరం!

పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో చదువు మానేయకూడదని ఉద్దేశంతో అమ్మఒడి పథకాన్ని అమలు చేస్తున్నామని గత వైసీపీ ప్రభుత్వం నమ్మబలికింది. పథకం ప్రారంభం నుంచి ఏటా కొత్త నిబంధనలు పెట్టి లబ్ధిదారుల సంఖ్యను కుదించుకుంటూ వచ్చింది. అర్హులకు సైతం పూర్తి స్థాయిలో నగదు విడుదల చేయకుండా కాలయాపన చేసింది. అయితే ప్రస్తుత ఎన్డీఏ కూటమి ప్రభుత్వం 'తల్లికి వందనం' పేరుతో ఈ పథకాన్ని అమలు చేసేందుకు రంగం సిద్ధం చేసింది. ఇచ్చిన హామీ మేరకు కుటుంబంలో చదువుకునే పిల్లలందరికీ పథకం వర్తింపచేయడంతోపాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివేవారంతా అర్హులని ప్రకటించింది. దీంతో గతంలో కంటే లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా పెరగనున్నదని విద్యాశాఖాధికారులు అంచనా వేస్తున్నారు.



నెల్లూరు (విద్య), ఆగస్టు 5 : జిల్లాలో అన్ని మేనేజ్‌మెంట్‌లు కలిపి మొత్తం 4,531 పాఠశాలల్లో 4 లక్షల మంది విద్యార్థులు, అన్ని మేనేజ్‌మెంట్‌లకు సంబంధించిన 215 కళాశాలల్లో 50 వేల మంది ఇంటర్ విద్యార్థులు ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో అమ్మఒడి ప్రారంభించిన తొలి సంవత్సరం (2019-20)లో లబ్ధిదారుల ఎంపికకు తెల్లరేషన్‌కార్డు, ఆధార్ కార్డులనే ప్రామాణికంగా తీసుకున్నారు. ఎంపిక చేసిన 2,20,607 మందికి రూ.15వేల చొప్పున నగదు జమచేశారు. 2021-22లో మాత్రం జిల్లాలో 3,75,849 మందిని లబ్ధిదారులుగా గుర్తించగా, వీరిలో 81,561 మందిని అనర్హులుగా ప్రకటించారు. మరో 6,698 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. 2,43,497 మందిని అర్హులుగా ఎంపిక చేసి, పాఠశాలల్లో పారిశుధ్యం పేరుతో ఒక్కో లబ్ధిదారుడికి వెయ్యి రూపాయలను తగ్గించి రూ.14వేల చొప్పున నగదు జమచేశారు. 2022-23లో ఈ జాబితాను మరింతగా వడబోసి 2,00,366 మందిని ఎంపిక చేశారు.ఆ విద్యా సంవత్సరంలో మూడుసార్లుగా నగదును ఖాతాల్లో జమచేశారు. 2023-24లో అసలు ఈ పథకం అమలు చేస్తారా.. లేదా ? అన్న సందేహాలు వ్యక్తం కాగా, నిబంధనలను మరింత కఠినతరం చేశారు. లబ్ధిదారుల సంఖ్యను 1,94,842కి తగ్గించి నాలుగు విడతలే అమ్మఒడి నగదును అందచేశారు.

● మార్గదర్శకాలు ఇవిగో..

ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనం పథకాన్ని త్వరలోనే అమలు చేయనున్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఈ పథకంతో పాటు స్టూడెంట్ కిట్ పొందడానికి ఆధార్ తప్పనిసరిగా ఉండాలని విద్యాశాఖ ప్రకటన జారీచేసింది. ఒకటి నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థులంతా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. విద్యార్థికి ఆధార్ లేకపోతే అది వచ్చే వరకు ఓటరు గుర్తింపుకార్డు, రేషన్‌కార్డు, పాస్‌పోర్టు, బ్యాంకు లేదా తపాలా పాస్‌బుక్, డ్రైవింగ్ లైసెన్స్, ఉపాధి పథకం కార్డు, కిసాన్ పాస్‌బుక్, వ్యక్తిని ధ్రువీకరిస్తూ గెజిటెడ్ అధికారి సంతకం చేసిన పత్రం, తహసీల్దారు ధ్రువీకరణ పత్రం.. ఇలా పదిరకాల పత్రాలను పరిగణలోకి తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఇప్పటికే స్టూడెంట్ కిట్ పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నామని, తల్లికివందనం పథకాన్ని కూడా ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తామని వారు పేర్కొన్నారు. విద్యార్థులంతా ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఎవరికైనా వేలిముద్రలు గుర్తించలేని స్థితిలో ఉంటే కనుపాపల ఆధారంగా గుర్తించనున్నామని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ పథకాన్ని వందశాతం అమలు చేసేలా చర్యలు చేపడుతున్నట్లు వారు తెలిపారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

● అనర్హులుగా 40 శాతం మంది

వైసీపీ ప్రభుత్వంలో పథకం అమలులో హాజరు కఠినతరం చేయడం, కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉన్నా ఒక్కరికే అమ్మఒడి ఇవ్వడం, ప్రభుత్వ శాఖల వద్ద ఉన్న సమాచారం ఆధారంగా సాంకేతికతను జోడించి జాబితాను వడపోసింది. దీంతో మొత్తానికి జిల్లాలో 40శాతం మంది విద్యార్థులపై అనర్హత వేటు వేసింది. జిల్లావ్యాప్తంగా సచివాలయాల్లోని అమ్మఒడి జాబితాల్లో తొలగింపులు, తిరస్కరణలు, బ్యాంకుల వద్ద పడిగాపులతో పథకం అంతా గందరగోళంగా మారింది. వీటికి తోడు అన్నీ అర్హతలు ఉన్నా కూడా చివరన అకౌంట్ల ఇన్‌యాక్టివ్ చేయడంతో తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య), ఆగస్టు 5 : 2024-25 విద్యా సంవత్సరానికి నేషనల్ మీన్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు జిల్లాలోని 8వతరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, 8వ తరగతి నడపబడుతున్న ఎంపీపీ అప్పర్ ప్రైమరీ స్కూల్స్, వసతి సౌకర్యం లేని జిల్లా ఆదర్శ పాఠశాలల్లో 8వతరగతి చదువుతూ కుటుంబ ఆదాయం రూ.3.5 లక్షలలోపు ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. డిసెంబరు 8వ తేదీన జరిగే ఈ పరీక్షకు జనరల్, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించి, సెప్టెంబరు 6వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో లేదా నగరంలోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని పరీక్షల విభాగంలో సంప్రదించాలని కోరారు.

మిర్చి రైతుకు

నష్టాల ఘాటు!

ఎర్ర బంగారం మంటూ రైతులు ముద్దుగా పిలుచుకునే మిర్చి ధర భారీగా పతనమైంది. దశాబ్ద కాలంలో ఎన్నడూ లేనిరీతిలో ధరలు పతనమై నష్టాల ఘాటు చూపుతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. తెగుళ్లు, వైరస్‌లు విపరీతంగా పెరిగిపోయినా రూ.లక్షలకు లక్షలు పెట్టుబడులు పెట్టి ప్రకృతికి ఎదురొడ్డి కొన్నేళ్లుగా మిర్చిని పండిస్తున్నారు. అయితే, రెండేళ్లుగా జెమినీ వైరస్, తామర పురుగుల దాడితో రైతులు మిర్చి సాగుకు మహాయజ్ఞమే చేస్తున్నారు. ఎకరానికి రూ.3-4 లక్షలు పెట్టుబడి పెట్టి రేయింబవళ్లు శ్రమించి మిర్చి పండిస్తున్నారు. అయినా ఎంతో కొంత లాభం వస్తుండటంతో నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో కొన్నేళ్లుగా మిర్చి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతూ వస్తోంది. మూడేళ్లుగా కేవలం కందుకూరు నియోజకవర్గంలోనే ఏటా సరాసరిన 4వేల ఎకరాలలో మిర్చి సాగవుతూ వస్తోందంటే ఏ స్థాయిలో మిర్చి సాగు విస్తీర్ణం పెరిగిందో అర్థం చేసుకోవచ్చు. మిర్చి సాగు విస్తీర్ణం పెరగడంతో కూలీలకు కూడా మంచి ఉపాధినిస్తోంది. అయితే అనూహ్యంగా ఈ ఏడాది మిర్చి ధర భారీగా పతనం కావటంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ ప్రభావం రానున్న సీజన్‌లో మిర్చి సాగువిస్తీర్ణంపై పడే అవకాశం ఉండనుంది.

- భారీగా పతనమైన ధర
- క్వింటం రూ.23వేల నుంచి 18వేలకు తగ్గుదల
- రానున్న సీజన్‌లో పంట సాగుపై ప్రభావం



కందుకూరు, ఆగస్టు 5 : కందుకూరు ప్రాంతంలో సాగయ్యే మిర్చిలో 90 శాతంపైగా తేజ రకం సాగవుతుండగా డిడి, నెంబరు 5, సూపర్ 10, సింజెంటా తదితర రకాల మిర్చి కేవలం 10 శాతం విస్తీర్ణంలో సాగవుతోంది. కందుకూరు, కావలి ప్రాంత తేజ రకానికి గుంటూరు మిర్చి మార్కెట్‌లో కూడా ప్రత్యేక గుర్తింపు ఉండటం ఈ ప్రాంత సరుకు నాణ్యమైనది కావటంతో క్వింటాల్‌కు వెయ్యి రూపాయల వరకు అదనంగా కూడా చెల్లించేందుకు వ్యాపారులు ముందుకొచ్చి పోటీ పడుతుంటారు. ఈ పరిస్థితుల్లో గత పంట కాలంలో మార్చి, ఏప్రిల్, మే నెలల్లో క్వింటం రూ. 23వేలు వరకు పలికిన మిర్చిని రైతులు అమ్ముకునేందుకు ఇష్టపడక శీతల గిడ్డంగిలలో నిల్వ చేశారు. అంతకముందు సంవత్సరాలలో క్వింటం రూ.28వేల వరకు ధర పలికింది. అంతే ధర వస్తుందన్న ఆశతో రైతులు కోల్డ్ స్టోరేజీలలో నిల్వచేశారు. అయితే 2 నెలలుగా ధరలు పతనమై ప్రస్తుతం అత్యంత నాణ్యమైన మిర్చి క్వింటం రూ. 18వేలకు మించి కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావటం లేదు. అధికశాతం రైతులు తమ ఉత్పత్తులతోపాటు సహచర రైతుల వద్ద అప్పట్లో ఉన్న ధర ప్రకారం కొనుగోలు చేసి మరీ కోల్డ్‌స్టోరేజీలలో నిల్వ చేశారు. కోల్డ్ స్టోరేజీలలో నిల్వచేసుకునే సమయంలో ఉన్న ధరతో పోలిస్తే క్వింటాంకు రూ.5వేలు, అంతక ముందు సంవత్సరం లభించిన ధరతో పోలిస్తే క్వింటంకు రూ.10వేలు ధర పతనమైంది. దీంతో నిల్వచేసిన రైతులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. కోల్డ్ స్టోరేజీల అద్దెలు, వడ్డీల రూపంలో క్వింటాల్‌కు మరో వెయ్యి రూపాయలు భారం తమపై పడిందని, ప్రస్తుతం అమ్మితే క్వింటంకు రూ.6-7 వేలు నష్టం వస్తుందని వాపోతున్నారు. తేజ రకం మిర్చి రైతుల పరిస్థితి ఇలా ఉంటే మిగిలిన రకాల ధరలు మరీ క్వింటం రూ. పదివేలు కూడా పలకని పరిస్థితి.

● సాగుపై ప్రభావం

మిర్చి ఎగుమతులతో డిమాండ్ ఏర్పడి ధరలు పెరగాల్సిన ఆగస్టు నెలలో కూడా ధరలు పతనమవుతుండటం, మరో ఏడాది అవసరాలకు తగినంత సరుకు కోల్డ్ స్టోరేజీలలో నిల్వ ఉందన్న అంచనాతో వచ్చే సీజన్‌లో రైతులు మిర్చి సాగుకు దూరంగా ఉండేందుకు సిద్ధపడుతున్నారు.

ఇవన్నీ తుప్పుపాలేనా!?



అన్నదాత దరిచేరాల్సిన ట్రాక్టర్ పనిముట్లు ఇదిగో ఇలా పిచ్చిమొక్కల మధ్య తుప్పుపడుతున్నాయి. రైతులకు పంపిణీ చేసేందు కోసం ట్రాక్టర్, రోటావేటర్ తదితర వ్యవసాయ పనిముట్లను వింజమూరు సహకార సంఘం కార్యాలయ ఆవరణలో ఉంచారు. అయితే, లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడంతో రోజుల తరబడి ఇక్కడే ఉండిపోయాయి. ట్రాక్టర్ టైర్లను దొంగలు ఎత్తికెళ్లిపోయారు. ఇక ఉన్న అరకొర పనిముట్లను అలాగే వదిలేయడంతో ఎండకు ఎండి, వానకు తడిచి ఇదిగో ఇలా తుప్పుదుతున్నాయి. ఇప్పటికైనా వ్యవసాయ, సహకార సంఘ అధికారులు స్పందించి, ఉన్నవాటికి మరమ్మతులు చేయించి లబ్ధిదారులకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

\- వింజమూరు

పెన్నమ్మ ఒడికి


బిరబిరా కృష్ణమ్మ..


సోమశిలకు కొనసాగుతున్న శ్రీశైలం జలాలు

కండలేరుకు ఇబ్బందులు తొలగనున్నాయ్!

- క్రమేణా పెరుగుతున్న నీటి నిల్వ
- చిగురిస్తున్న అన్నదాత ఆశలు

అనంతసాగరం, ఆగస్టు 5: ఈ ఏడాది జిల్లా ఎగువన ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోవడంతో సోమశిల జలాశయం నీటిమట్టం పడిపోయింది. పంటలు లేక పచ్చని పొలాలు బీడువారుతున్న సమయంలో పెన్నమ్మ ఒడికి కృష్ణమ్మ చేరువకావడంతో జిల్లాకు ఊరట కలిగింది. సోమశిల డ్యాం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంలు కాగా మొన్నటి వరకు ఎగువ నుంచి నీటిలభ్యత లేక డెడ్‌స్టోరేజ్‌కు చేరుకుంది. సాగు పక్కన పెడితే జిల్లాలో తాగునీటి కొరతపై ప్రజల్లో బెంగ నెలకొంది. ఈ క్రమంలో శ్రీశైలం కృష్ణ ప్రవాహంతో పాటు గోదావరి జలాలు కూడా తోడు కావడంతో భారీ వరదలు కొనసాగి కొద్దిరోజుల వ్యవధిలోనే శ్రీశైలం నిండుకుండలా మారింది. దీంతో దిగువ నాగార్జున సాగర్, రాయలసీమ ప్రయోజనాల నిమిత్తం పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి బనకచర్ల ప్రాజెక్టునకు నీటి సరఫరా చేశారు. అక్కడ నుంచి తెలుగుగంగకు ద్వారా సోమశిలకు ప్రవాహం కొనసాగుతుండటంతో జిల్లాకు నీటి బెంగ తీరింది. సోమశిలకు ఆగస్టు 1న 2,750 క్యూసెక్కులు నమోదైన ప్రవాహం అప్పటి నుంచి క్రమేణ కొనసాగుతోంది. సోమవారానికి 7,342 క్యూసెక్కులు నమోదవగా నీటి మట్టం 11.740 టీఎంలకు చేరుకుంది. వచ్చే ప్రవాహానికి తోడుగా ఎగువన చెదురు ముదురుగా వర్షం కురిస్తే ప్రవాహం పెరిగే సూచనలు ఉన్నాయి.


నీరు లేక సోమశిల చెంత బీడుగా ఉన్నా పొలాలు

రోజువారీగా 10,500 క్యూసెక్కులు (1టీఎంసీ) నీరు వస్తే సుమారు 50రోజుల్లో సోమశిల నిండుకుండలా మారే అవకావం వుంటుంది. దీంతో రబీ సాగుకు నీటి ఇబ్బందులు తీరుతా యని ఆ దిశగా ఎగువ నుంచి వచ్చే వరద జలాలు నిరంతరం కొనసాగాలని అన్నదాతలు ఆకాంక్షిస్తున్నారు.

ప్రభుత్వం చొరవతోనే..

నీటి ఇబ్బందులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతేక చొరవ చూపింది. గత నెలలో సోమశిలకు మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పొంగూరు నారాయణతోపాటు జలవనరుల శాఖామాత్యు లు నిమ్మల రామానాయుడు సోమశిలను సంద ర్శించారు. ఇక్కడ పరిస్థితిని అర్థం చేసుకోవ డంతో పాటు సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో శ్రీశైలం వరద రావడం.. ఇక ఆలస్యం లేకుండా తెలుగుగంగకు నీటి విడుదలకు శ్రీకారం చుట్టారు. దీంతో వచ్చే సీజన్‌కు నీటి ఇబ్బందులు ఉండవన్న భరోసా కనిపిస్తోంది.

సోమశిలకు వచ్చే వరద ప్రవాహం ఇలా..

తేదీ	ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	టీఎంసీలు
1.8.2024	2,750	9.471
2.8.2024	5,169	9.893
3.8.2024	7,574	10.523
4.8.2024	7,307	11.130
5.8.2024	7,342	11.740

సోమశిల నీటి మట్టం పెరిగిన అనంతరం కండలేరుకు నీటి విడుదల చేసే ప్రణాళిక చేస్తున్నారు. పూర్తిస్థాయి నీటి నిల్వ 68 టీఎంసీలు కాగా ప్రస్తుతం కండలేరులో 6.066 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. దిగువ కాలువలకు 150 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. ఇక్రమంలో నీటి లభ్యత లేక ప్రాజెక్టు కళావిహీనంగా తయారయ్యింది. ఈనేపథ్యంలో సోమశిల నీటిమట్టం పెరిగిన వెంటనే త్వరలో వరద కాలువ ద్వారా కృష్ణ జలాలు తరలింపు జరిగే సూచనలు ఉన్నాయి.

అర్జీల పరిశీలనలో
నిర్లక్ష్యం వద్దు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా రెవెన్యూ అధికారి లవన్న

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 5 : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా వివిధ సమస్యలపై ప్రజల నుంచి అందిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా సమస్య మూలాల్లోకి వెళ్లి పరిశీలించి పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి లవన్న అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీరించి మాట్లాడారు. అవసరమైతే క్షేత్ర స్థాయికి వెళ్లి సమస్యలను పరిష్కరించాలన్నారు. వచ్చిన సమస్యలే మళ్లీ మళ్లీ పునరావృతం కాకుండా చూడాలన్నారు. వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● సాగునీటి కాలువల్లో పూడిక తీత పనులు ప్రారంభించాలి : బీజేపీ

సాగునీటి కాలువల్లో పూడిక తీత పనులు ప్రారంభించాలని కోరుతూ బీజేపీ నమామిగంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ డీఆర్వోకు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఏడాదికి రూ.20 కోట్లు ఖర్చు చేస్తున్నా పంట కాలువల్లో పూడికతీత సరిగాలేదని విమర్శించారు. నిధులు దుర్వినియోగమవుతున్నాయే తప్ప ఆయకట్టుకు నీరందే పరిస్థితి లేదన్నారు. పంటకాలువల్లో మట్టిని వెంటనే తొలగించాలని కోరారు.

● సోమిరెడ్డి అవినీతితోనే యాష్‌పాండ్‌కు గండి : కాకాణి

సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆయన కుమారుడి ధనదాహానికి జన్కో యాష్ పాండ్‌కు గండిపడి రైతుల పొలాలు సర్వనాశనమయ్యాయని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపిస్తూ డీఆర్వో లవన్నకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మా ట్లాడుతూ 2019 ఎన్నికలకు ముందు యాష్ పాండ్ టెండర్లు పిలిపించి కాం ట్రాక్టర్ దగ్గర డబ్బులు దండుకొన్నారని ఆరోపించారు. బూ డిద పూడికతీతకు అడ్డంకి సృష్టించటంతోనే ఈ ప్రమాదం జరిగిందన్నారు. నెలకు 16 బల్కర్ల ద్వారా ఫ్లైయాష్ అక్రమ రవాణా చేస్తూ రూ.16 లక్షలు గడిస్తున్నారని ఆరోపించారు.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో లవన్న

ఆటోడ్రైవర్ మృతిపై
ఎమ్మార్పీఎస్ ఆందోళన

- బాధిత కుటుంబానికి మద్దతుగా రోడ్డుపై బైఠాయింపు
- స్తంభించిన వాహనాల రాకపోకలు
- తహసీల్దార్ హామీతో ఆందోళన విరమణ
- పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో విచారణ


వైద్యుల తీరుపై తహసీల్దార్‌కు వివరిస్తున్న ఆందోళనకారులు

సైదాపురం, ఆగస్టు 5: ఆటో డ్రైవర్ మల్లవరపు వీరరాఘవయ్య మృతికి నిరసనగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబీకులు సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సర్కిల్ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరసన చేపట్టడంతో వాహనాలు ఇరువైపులా భారీగా నిలిచి పోయాయి. రాపూరు సీఐ విజయకృష్ణ పోలీస్ సిబ్బందితో అక్కడకు చేరుకుని సర్దిచెప్పినా వారు వినలేదు. సాయంత్రం తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ వచ్చి ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం అందించేందుకు కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు. బాధిత కుటుంబానికి రెండు ఎకరాల భూమి, 30 అంకణాలు ఇంటి స్థలం ఇస్తామని, వైద్యులపై చర్యలు తీసుకునేందుకు అధికారులకు నివేదికలు అందజేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళ విరమించారు. అనంతరం డీఎంహెచ్‌వో పెంచలయ్య పీహెచ్‌సీ కార్యాలయం వద్దకు చేరుకుని విచారించారు. అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు వీరరాఘవయ్య మృతికి మద్దతు తెలిపి నిరసనలో పాల్గొన్నారు. వాహన రాకపోకలు స్తంభించి పోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

ఏఎస్పీ సీహెచ్ సౌజన్య

నెల్లూరు,(క్రైం), అగస్టు 5: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని ఏఎస్పీ సీహెచ్ సౌజన్య అధికారులను ఆదేశించారు. ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఎస్పీ జి కృష్ణకాంత్ ముఖ్యమంత్రి సమావేశానికి హాజరవ్వడంతో ఆయన ఆదేశాలతో ఏఎస్పీలు ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 119 మంది ఫిర్యాదు దారులు తరలివచ్చి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ సౌజన్య మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారించి బాధితులకు న్యాయం చేస్తామ ని, త్వరితగతిన పరిష్కరస్తామని తెలిపారు.


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ సౌజన్య

● నెల్లూరు నగరానికి చెందిన ఓ ఎన్‌జీవో ట్రస్ట్‌కు జరోదా-తివారి గ్రూప్స్ ద్వారా రూ.12 కోట్లు విరాళాలు ఇపిస్తామని శ్రీనివాసులు, సాయి, అభినవ్, హరీష్‌రెడ్డిలు మోసం చేశారని బాధితులు ఫిర్యాదు చేశారు. విరాళాలు ఇప్పిస్తామని చెప్పి ప్రాసెసింగ్ ఫీజు కింద రూ.18 లక్షల కట్టించుకొని ఎలాంటి విరాళాలు విప్పించకపోగా తప్పుడు కేసులు పెడుతున్నారని, విచారించి న్యాయం చేయాలని కోరారు.

● కుటుంబ తగాదాల కారణంగా తన భర్త వేధింపులకు గురిచేయడమే కాకుండా తన పిల్లలను తీసుకొని వెళ్లిపోయాడని, తనకు న్యాయం చేయాలని కోరుతూ కోటమిట్ట ప్రాంతానికి చెందిన మహిళ ఫిర్యాదు చేసింది.

● గుర్తుతెలియని వ్యక్తులు ఆన్‌లైన్ యాప్ ద్వారా అనధికారికంగా లోన్ తీసుకున్నావంటూ ఇబ్బంది పెడుతున్నారని, న్యాయం చేయాలని నగరంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన ఓ మహిళను ఫిర్యాదు చేసింది. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ క్రైమ్స్ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, మహిళా పోలీసు స్టేషన్ డిఎస్పీ సాయినాథ్ పాల్గొన్నారు.

● జమ్ము, కాశ్మీర్ యాత్రకు స్నేహితులతో కలిసి వెళ్లిన నా కుమారుడు సాయినాథ్‌రెడ్డి మరణంపై అనుమానం ఉందని, వెంటనే విచారణ జరిపించాలని నగరంలోని ఏసీ నగర్ ప్రాంతం లో నివాసం ఉంటున్న కామాక్షి వరప్రసాద్‌రెడ్డి పోలీసులను కోరారు. ఈ మేరకు పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు.

జీవో నెం.117ను రద్దు చేయాలి

నెల్లూరు(హరనాథపురం) : జీవో నెం.117ను రద్దు చేయాలని కోరుతూ దళిత సంఘర్షణ సమితి నాయకు లు సోమవారం కలెక్టరేట్ ఎదుట విద్యార్థుల తల్లి దండ్రులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా దళి త సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి మా ట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం 117ను తీసుకొని వచ్చి ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న 3, 4, 5 తరగతు ల విద్యార్థులను మూడు కి.మీ దూరంలో ఉన్న హై స్కూళ్లలో కలిపారన్నారు. దీంతో పిల్లలు చదువు మానే యాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ ధర్నాలో నాయకులు కె.కోటయ్య, శ్రీనివాసులు సత్యవతమ్మ, జరుగుమల్లి విజయరత్నం, నారుబోయిన లక్ష్మీనర్సు, భాస్కర్, జనార్దన్, దాసు పాల్గొన్నారు.

క్షయ నివారణకు వ్యాక్సిన్ వేసుకోవాలి

● ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 5 : క్షయ నివారణకు బీసీజీ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేసుకోవాలని ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. సోమవారం నగరంలోని రామాలయం వీధి పట్టణ పీహెచ్‌సీలో బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న తీరును ఆయన పరిశీలించారు. దీనికి సంబంధించి కొన్ని సూచనలు చేశారు. వృద్ధులకు, క్షయ వ్యాధికి గురైన వ్యక్తి కుటుంబ సభ్యులకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేసుకోవాలన్నారు. అలాంటి వారిని గుర్తించి వ్యాక్సిన్ వేయాలని సూచించారు. క్షయ వ్యాధి నిర్మూలనే ధ్యేయంగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సింధూరి, సీనియర్ క్షయ సూపర్‌వైజర్ వేణుగోపాల్, హిమదర్ తదితరులు పాల్గొన్నారు.

నార్తురాజుపాళెంలో
రూ.5కోట్ల ప్రభుత్వ స్థలం కబ్జా

- గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మందిపాటి
- కబ్జాస్థలంలో మట్టి తవ్వకాలను అడ్డుకున్న టీడీపీ నేతలు


ఆక్రమిత స్థలంలో తవ్వకం పనులను అడ్డుకున్న టీడీపీ నాయకులు

కొడవలూరు ఆగస్టు 5 : రూ. ఐదుకోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని వైసీపీకి చెందిన ఓ బడానాయకుడు కబ్జా చేశారని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మందిపాటి ప్రవీణ్ కుమార్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని నార్తు రాజుపాళెంలో గల రొయ్యల కర్మాగారం ఎదుట ఉన్న స్థలంలో సోమవారం రెండు ట్రాక్టర్లు,ఎక్స్‌కవేటర్లతో పనులు, ఇతర మరమ్మతులు చేపట్టారు. ఈ పనులను ప్రవీణ్‌కుమార్‌రెడ్డితోపాటు జిల్లా టీడీపీ నాయకుడు కరకటి మల్లికార్జున, ఇతర టీడీపీ నేతలు అడ్డుకున్నారు. ప్రభుత్వ స్థలంలో ఎలా పనులు నిర్వహిస్తారంటూ వారు కబ్జాదారుడిని ప్రశ్నించారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న ఎస్ఐ హనీఫ్, సీఐ శ్రీనివాసరావుతోపాటు రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొన్నారు. జరిగిన విషయంపై సీఐ ఆరా తీశారు. ఇది పంచాయతీ స్థలమా... లేక రెవెన్యూ స్థలమా...? అనేది తహసీల్దార్, ఎంపీడీవో పరిశీలిస్తారన్నారు. కబ్జా అయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. అప్పటి వరకు ఎలాంటి పనులు చేపట్టరాదని సూచించారు. దీంతో సమస్య సద్దుమణిగింది.అనంతరం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఈ బడా నాయకుడు చేయని అక్రమాలు, అవినీతి లేవన్నారు. ఎక్కడ ప్రభుత్వ స్థలం కనిపించినా దర్జాగా కబ్జా చేశారన్నారు. పట్టపగలే కబ్జా చేసిన ప్రభుత్వ భూమిలో మట్టిని తవ్వి తన సొంత లేవుట్లకు తరలించాడని ఆరోపించారు. అలాగే ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి వారిని భయభ్రాంతులకు గురి చేశాడని పేర్కొన్నారు. మట్టి, గ్రావెల్‌ను యథేచ్ఛగా దోచుకున్నాడని దుయ్యబట్టారు. రూ. కోట్లు విలువ చేసే స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసూకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే నార్తురాజుపాళెంలోని అధికారులు తమ తీరుమార్చుకోవాలన్నారు. ఇప్పటికీ కొంతమంది వైసీపీ జెండా పట్టుకుని విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాటూరి రమేష్, నాసిన ప్రసాద్ తువ్వర ప్రవీణ్, సిద్ధార్థ, బాబీ, బండి కిరణ్, మురళీ తదితరులు పాల్గొన్నారు.


రెవెన్యూ అధికారులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న సీఐ శ్రీనివాసరావు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	100
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	190
స్కిన్‌లెస్	210
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6518
వెండి కిలో ధర	రూ. 82,800
వెండి ఒక గ్రాము	రూ. 84.80

స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా శ్రీనివాసరావు



నెల్లూరు,(క్రైం), అగస్టు 5: నెల్లూరు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా అత్తిన శ్రీనివాసరావు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాస రావు 1991 లో పోలీసుశాఖలో ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. రాజ మండ్రి, నంద్యాల జిల్లా ఆత్మకూరు డిఎస్పీగా పనిచేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో నెల్లూరు ఎస్‌బీ డిఎస్పీగా నియ మితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన డిఎస్పీని ఎస్‌బీ ఇన్ స్పెక్టర్‌లు మిద్దె నాగేశ్వరమ్మ, జానీ, ఎస్ఐ సుబ్బారావు, సైబర్ క్రైమ్ ఎస్ఐ సురేష్, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డిఎస్పీ శ్రీనివాసరావు ఏఎస్పీ సీహెచ్ సౌజన్యను మర్యాదపూర్వకంగా కలిశారు.

జీవో నెం.77ను రద్దు చేయాలి

● ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన


వీఆర్‌సీ కూడలిలో నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నేతలు

నెల్లూరు(విద్య), ఆగస్టు 5 : జీవో నెం 77ను రద్దు చేసి పీజీ విద్యార్థులకు వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించాలని ఏబీవీపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని వీఆర్‌సీ సెంటర్‌లో సోమవారం నిరసన కార్యక్ర మం చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రాహుల్ మాట్లాడుతూ గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం 77 కారణంగా పీజీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వెంటనే జీవోను రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయా లన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నేతలు సమీర్, సుమన్, రాబర్ట్, వినోద్, హేమంత్, సుకుమార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

హైస్పీడ్ ధాటికి
మరబోట్ల బేజారు!


జువ్వలదిన్నె హార్బర్ బెర్తుల వద్దకు చేరిన మరబోట్లు

- ఆంధ్ర సరిహద్దుల్లోకి చొరబడుతున్న తమిళ జాలర్లు
- మత్స్య సంపదను దోచుకెళుతున్న వైనం
- వేటకు వెళ్లాలంటే హడలుతున్న మత్స్యకారులు

బిట్రగుంట, ఆగస్టు 5: సముద్రపు వేటే జీవనోపాధిగా బతుకుతున్న సింహపురి గంగపుత్రులకు తమిళనాడులోని నాగపట్నం కడలూరు, కారికల్ మత్స్యకారులతో ముప్పు పొంచి ఉంది. ఈ క్రమంలో బోగోలు మండలం తూర్పు తీరప్రాంతాల గంగపుత్రులు సముద్రంలో వేటకు వెళ్లాలంటే హడలిపోతున్నారు.

● మత్స్య సంపద దోపిడీ

హైస్పీడ్, మెకనైజ్డ్ బోట్లతో కారికల్, కడలూరు మత్స్యకారులు దౌర్జన్యంగా ఆంధ్ర తీరంలో చొరబడి మత్స్యసంపదను దోచుకుపోతున్నారు. బోగోలు, అల్లూరు, చెన్నాయపాలెం తీరప్రాంతాల మత్స్యకారులు సహజంగా మరబోట్లతో వేట సాగిస్తుంటారు. అయితే తమిళ జాలర్ల హైస్పీడ్, మెకనైజ్డ్ బోట్ల వేగానికి మరబోట్లు తట్టుకోలేక పోతున్నాయి. బోట్లు దెబ్బతినడమే కాకుండా ఖరీదైన వలలు పనికిరాకుండా పోతున్నాయి.

● ఆందోళన చేసినా..

అల్లూరు మండలం ఇస్కపల్లి తీరప్రాంత మత్స్యకారులపై రెండేళ్ల క్రితం కడలూరు, కారికల్‌కు చెందిన మత్స్యకారులు దాడులు చేయగా, పలువురికి గాయాలయ్యాయి. దీంతో ఇస్కపల్లి మెరైన్ పోలీస్ స్టేషన్ వద్ద స్థానిక మత్స్యకారులు పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. అనంతరం అధికారులు, వైసీపీ ప్రజాప్రతినిధులు కంటితుడుపు మాటలు చెప్పి గంగపుత్రులను మభ్యపెట్టారు. ఈ క్రమంలో ప్రభుత్వ అధికారులతో ఎటువంటి న్యాయం జరగలేదని కాకినాడ, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు చెందిన మత్స్యకార పెద్దలతో ఇస్కపల్లిలో పెద్దఎత్తున సమావేశం జరిగింది. హైస్పీడ్ మెకనైజ్డ్ బోట్లను ఎదుర్కోడానికి అంతటి సామర్థ్యం కలిగిన బోట్లు ఉంటేతప్ప ఏమీ చేయలేమని ఆ సమావేశంలో పెద్దలు తీర్మానం చేశారు. ఆనాటి వైసీపీ ప్రభుత్వం ఆంధ్రరాష్ట్ర మత్స్యకారులకు అండగా ఉంటామని చెప్పి, ఏళ్ల గడుస్తున్నా తమిళనాడు మత్స్యకారులను అడ్డుకున్న దాఖలాలు లేవు.

● మంత్రి దృష్టికి సమస్యలు

వారం రోజులుగా బోగోలు మండలం తాటిచెట్లపాలెం, పాతపాలెం, టెంకాయచెట్లపాలెం, బంగారుపాళెం మత్స్యకారులు సముద్రపు వేట నిలిపివేసి, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ బెర్తుల వద్దకు చేరుకున్నారు. ఇటీవల రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పర్యటనలో మత్స్యకారులు పలుసమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన మంత్రి అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని చెప్పారని గంగపుత్రులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని తమిళ మత్స్యకారులను కట్టడి చేయకుంటే, జిల్లాలోని గంగపుత్రులు వేట మానుకోవాల్సి ఉంటుంది.


తెగిన రింగు వలలు సరిచేసుకుంటున్న మత్స్యకారులు

అధ్వానంగా గ్రామీణ రహదారులు

● రోడ్ల నిర్మాణాలు చేపట్టాలంటున్న వాహనదారులు, ప్రయాణికులు

వరికుంటపాడు, ఆగస్టు 5: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి- గణేశ్వరాపురం, తొడుగుపల్లి- నార్త్ కొండాయపాళెం, జడదేవి- తూర్పు చెన్నంపల్లి, పెద్దిరెడ్డిపల్లి- పాములూరుపల్లి ప్రధాన రహదారులతో పాటు జీ.కొత్తపల్లి, నల్లబోతుల వారిపల్లి, సాతువారిపల్లి, కొండ్రాజుపల్లి, జంగంరెడ్డిపల్లి, రామాపురం, కాకొల్లువారిపల్లి గ్రామాల అంతర్గత రహదారులు మరమ్మతులకు నోచుకోక అధ్వానంగా ఉన్నాయి. కొన్నేళ్ల కిందట నిర్మించిన రోడ్లు కావడంతో ఛిద్రమై పోయాయి. రాళ్లు, రప్పలు తేలడంతో వాహనదారులకు ప్రయాణం నరక ప్రాయంగా మారింది. కొన్నిగ్రామాల రోడ్లు ఇప్పటికీ తారురోడ్డుకు నోచుకోలేదు. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డు గుంతల్లో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. అత్యవసర సమయాల్లో అద్దె వాహనదారులను గ్రామాలకు పిలిచినా వారు వచ్చేందుకు సముఖత చూపడం లేదు. రాత్రి సమయంలో అటువైపు వెళ్లే వాహనదారులు గమ్యం చేరేంత వరకు అడుగడుగునా అంతరాయం ఎదుర్కోవాల్సి వస్తుందని గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


తొడుగుపల్లికి వెళ్లే రోడ్డు దుస్థితి

దరఖాస్తుల ఆహ్వానం

ఏఎస్ పేట, ఆగస్టు 5: హసనపురం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2024-25 విద్యా ఏడాది ఎలక్ట్రీషన్, ఫిట్టర్ ట్రేడులలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ షేక్ గౌస్‌బాషా తెలిపారు. 10వ తరగతి పాస్ అయిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 27వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 29న కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలన్నారు.

పాఠశాల తనిఖీ

ఉదయగిరి రూరల్, ఆగస్టు 5: దుర్గంపల్లి ప్రాథమిక ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎంఈవో-2 తోట శ్రీనివాసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరుగుతున్న మనబడి- మన భవిష్యత్తు పనులు పరిశీలించారు. అనంతరం విద్యార్థుల ప్రగతిని, రిజిస్టర్లు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జాఫర్‌అహ్మద్, ఉపాధ్యాయుడు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు

ఆత్మకూరు, ఆగస్టు 5: స్థానిక హనుమాన్ జంక్షన్ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉభయ దాతలు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. .

ముగిసిన గంధోత్సవం

ఉదయగిరి రూరల్, ఆగస్టు 5: స్థానిక సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ ఖాదరీ ఔలియా గంధోత్సవం సోమవారం తహలీల్ ఫాతెహ కార్యక్రమంతో ముగిసింది. స్వామివారికి మస్తాఫాఅలీఖాన్ సాహెబ్ కుటుంబ సభ్యులు గలీఫ్ ఫాతెహ నిర్వహించి ప్రార్థనలు చేపట్టారు. పూజల్లో హిందూ, ముస్లింలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం అన్నదానం చేశారు.

వాగుభూమి ఆక్రమణపై ఫిర్యాదు

సీతారామపురం, ఆగస్టు 5: గ్రామంలోని తమ ఇళ్ల సమీపంలో ఉన్న వాగు పోరంబోకు భూమిని గ్రామానికే చెందిన కొంతమంది వ్యక్తులు ఆక్రమించి అందులో జామాయిల్ మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కొయ్యలపాడు ఎస్సీకాలనీవాసులు తెలిపారు. ఈ విషయంపై సోమవారం వారు తహసీల్దార్‌కు విన తిపత్రం అందజేశారు. ఈ భూమి ఆక్రమణకు గురికాకుండా చూడాలని వారు వినతిలో పేర్కొన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ

సీతారామపురం, ఆగస్టు 5: మండలకేంద్రంలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులను సోమవారం టెక్నికల్ అసిస్టెంట్ మురళీకృష్ణ పరిశీలించారు. కూలీలు చేయు పనులు, మస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ఎంత పనిచేయాలో కొలతలు వేసి చూపించారు. ఉదయం 6.30 నుంచి 11గంటల వరకు పనిచేస్తే రోజుకు రూ.300ల వేతనం వస్తుందన్నారు. అనంతరం మాస్టర్‌లోని పేర్లు చదువుతూ వచ్చిన వారికి హాజరు వేశారు.

వరి పొలాల పరిశీలన

చేజర్ల, ఆగస్టు 5: పెరుమాకళ్లపాడు సమీపంలోని వరి పొలాలను సోమవారం మండల వ్యవసాయాధికారి శశిధర్ పరిశీలించారు. ఎడగారు సీజన్‌లో పండించిన వరిలో ఎక్కువగా నల్లి ఆశించిందన్నారు. నివారణకు ఒబీరియన్ అనే మందును ఎకరాకు 100ఎమ్‌ఎల్ చొప్పున పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో వెంకటేశ్వర్లు, వీపీఏ బ్రహ్మేంద్ర, రైతులు పాల్గొన్నారు.

సాగునీటి వనరులపై ఆరా

సంగం, ఆగస్టు 5: మండలంలోని సాగునీటి వనరుల స్థితిగతులపై సోమవారం మండలస్థాయి ఫ్లడ్ బ్యాంక్ మేనేజ్‌మెంట్ టీమ్ సభ్యులు ఆరా తీశారు. అన్ని చెరువులు, కాలువల కట్టల పటిష్టత, తూములకు చేపట్టాల్సిన రక్షణ చర్యలు, ఆక్రమణలను పరిశీలించారు. నివేదికను తయారు చేసి కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫ్లడ్ బ్యాంక్ మేనేజ్‌మెంట్ టీమ్ కన్వీనర్ ఏఈ బీవీ కృష్ణ, సభ్యులు డిప్యూటీ తహసీల్దారు సుభాషిణి, ఎస్‌ఐ నాగార్జునరెడ్డి, సర్వేయర్ పాల్గొన్నారు

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలపై అవగాహన

సంగం, ఆగస్టు 5: స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలపై ఎంఈవో జానికీరామ్ అవగాహన కల్పించారు. ఈ నెల 8న జరుగనున్న ఎస్‌ఎంసీ కమిటీ ఎన్నికపై విధివిధానాలను వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో -2, జిల్లా రిసోర్స్‌పర్సన్ వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం పాల్గొన్నారు.

సమస్యలపై గిరిజనుల నిరసన

చేజర్ల, ఆగస్టు 5: తమ కాలనీల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని నూతక్కివారి కండ్రిక గ్రామపంచాయతీలోని గిరిజన కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై సోమవారం వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నికల్లో తాము తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇచ్చామని వెలగని వీధి లైట్లకు సర్పంచ్ మరమ్మతులు చేపట్టడం లేదని మండిపడ్డారు. కాలనీల రహదారుల్లో మురుగునీరు పారుతున్నా పట్టించకోలేదన్నారు. ఇలాగే ఉంటే రోగాల బారినపడతామని ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.


నిరసన వ్యక్తం చేస్తున్న నూతక్కివారికండ్రిక గిరిజనులు

అటవీ సంపద అక్రమంగా తరలింపు

వరికుంటపాడు, ఆగస్టు 5: మండలంలోని గ్రామాల నుంచి నిబంధనలకు విరుద్ధంగా అటవీ సంపద అక్రమంగా తరలిపోతున్నా పట్టించుకొనే వారు కరువయ్యారు. జి ల్లాకేంద్రానికి శివారు మండలం కావడంతో ఉన్నతాధికారుల తనిఖీలు ఉండవనే ధీమాతోనే కొంత మంది అధికారులు అక్రమ వ్యాపారులకు అండగా నిలుస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అటవీ ప్రాంతాలతో పాటు ఇరిగేషన్, పంచాయతీల పరిధిలోని కంపచెట్లతో సహా వేప, తుమ్మ చెట్లను సైతం నరుకుతూ తీసుకెళుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా సమీపంలోని ప్రకాశం జిల్లాతో పాటు తమకు అనుకూలమైన బొగ్గు, ఇటుక బట్టీలకు తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. స్థానికులు సమాచారం అందించిన సమయంలో అధికారులు తక్కువ మొత్తంలో జరిమానాలు విధించి చేతులు దులుపుకుంటున్నారు. ఉన్న తాధికారులు ప్రత్యేక నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


కలప తరలిస్తున్న ట్రాక్టర్


విద్యతోనే ప్రగతి సాధ్యం : ఎంపీపీ

ఆత్మకూరు, ఆగస్టు 5: విద్యతోనే ప్రగతి సాధ్యమని మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు విద్యాకిట్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందజేసిన కిట్‌లో కాలేజీ బ్యాగ్, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు ఉంటాయన్నారు. జూనియర్ కళాశాలల్లో మెరుగైన విద్యనందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తుమ్మల చంద్రారెడ్డి, కౌన్సిలర్ నూరా భాస్కర్‌రెడ్డి, కళా శాల ప్రిన్సిపాల్ వాణి, అధ్యాపకులు ఉన్నారు.


ఆత్మకూరు: విద్యాకిట్‌ను అందజేస్తున్న ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ఉదయగిరి రూరల్, ఆగస్టు 5: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లోని 335మంది విద్యార్థులకు సోమవారం అధ్యాపకులు పాఠ్య, నోట్ పుస్తకాలు, బ్యాగులు విద్యా సామగ్రిని అందశారు. ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం పుస్తకాలు ఇవ్వడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.


ఉదయగిరి రూరల్: విద్యార్థులకు కిట్‌ను అందజేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

తాటి చెట్టే కరెంట్ స్తంభం!

మర్రిపాడు, ఆగస్టు 5: రెండేళ్ల కిందట తన పొలంలో వేసిన కరెంట్ స్తంభం ఇరిగిపో యిందని దాని స్థానంలో మరో స్తంభంను ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు మండల ట్రాన్స్ కో అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని మర్రిపాడు గ్రామానికి చెందిన గంగినేని వెంకటేశ్వర్లు వాపోతున్నారు. ఈ విషయంపై మంగళవారం ఆయ న ఆంధ్రజ్యోతితో తమగోడు విన్నవిం చుకున్నాడు. సర్వీస్ నెంబర్ 567తో తనకు విద్యుత్ కనెక్షన్ ఉందని, తన పొలానికి కరెంట్ సరఫరా తీసుకున్నపుడు ఏర్పాటు చే సిన స్తంభం విరిగిపోయిందన్నారు. అప్పటినుంచి మరో స్తంభంను ఏర్పాటు చేయాలని ఎన్ని సార్లు సబ్‌స్టేషన్, అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదన్నారు. చేసేదిలేక ప్రత్యా మ్నాయంగా అందుబాటులో ఉన్న తాటిచెట్టుకు కేబుల్ వైరును కట్టుకొని తద్వారా మోటర్ న డుపుకుంటూ ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. వర్షాకాలంలో తీగలకు ఏదైనా అర్త్ వస్తే చె ట్టుకు, తడిసిన పొలానికి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.


తాటి చెట్టుకు కట్టిన కేబుల్ వైరు

విధుల్లో చేరిన తహసీల్దార్లు

చేజర్ల ఆగస్టు 5: మండల తహసీల్దార్‌గా ఏవీ రమణారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో అనంతసాగరం, జలదంకి మండలాల తహసీల్దారుగా పనిచేస్తూ ఎన్నికల నేపథ్యంలో అమరావతికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దారు రమణారావు మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇస్తామన్నారు. పెండింగ్‌లో భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): మండల తహసీల్దారుగా యనమల నాగరాజు బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దారు యశోదను బదిలీ చేయడంతో ఆమె స్థానంలో నాగరాజు వచ్చారు. తహసీల్దారుకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల కమిటీ సభ్యులు సన్మానించి అభినందనలు తెలిపిపారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్, యద్దనపూడి రమణయ్య, గొల్లపల్లి మోహన్‌రావు పాల్గొన్నారు.

వింజమూరు: మండల తహసీల్దార్ హమీద్ బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా ముందుకు సాగాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు.

గవర్నర్ కార్యదర్శిని కలిసిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 5: రాష్ట్ర గవర్నర్ సెక్రటరీ డాక్టర్ ఎం.హరిజవహర్‌లాల్‌ను సోమవారం రాజ్‌భవనలో రాష్ట్ర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. స్వచ్ఛంద సేవాసంస్థలు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని, రైతులను సేంద్రీయ వ్యవసాయం వైపు మళ్లించాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల అధ్యక్షుడు రమణయ్య, సభ్యులు ప్రకాష్, మామిడిపల్లి బాలగంగాధర్, వెంకటశ్రీనివాస్ తదితరులున్నారు.

వైభవంగా బాలచౌడేశ్వరి గ్రామోత్సవం

సంగం, ఆగస్టు 5: స్థానిక రాళ్లచెలిక బాల చౌడేశ్వరిదేవికి ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు గ్రామోత్సవం నిర్వహించారు. .

చాకలకొండ రాధాకృష్ణమూర్తికి ఘన నివాళి

వింజమూరు, ఆగస్టు 5: రాధాకృష్ణ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం రాధాకృష్ణమూర్తి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పదో తరగతిలో అత్యధిక మార్కుల సాధించిన విద్యార్థులకు నగదుతో పాటు బహుమతిని అందజేశారు. పాఠశాలకు రూ.25వేల మైక్‌సెట్‌ను ఇచ్చారు. కార్యక్రమంలో చాకలకొండ సత్యనారా యణరావు, చెన్నయ్య, కృష్ణారెడ్డి, ఆనంద్, ప్రధానోపాధ్యాయులు రమేష్ ఉన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

శిథిల పాఠశాలలో చదువులా ?

లింగసముద్రం, ఆగస్టు 5 : మండలంలోని చినపవని ఎస్సీకాలనీ ప్రాథమిక పాఠశాల కొన్నేళ్లుగా శిథిలావస్థలో ఉంది. పాఠశాల గోడలు నెర్రెలివ్వడం, శ్లాబు పైకప్పు పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటపడి వర్షం కురిస్తే ఉరుస్తోంది. వరండాలోనూ ఇదే పరిస్థితి. ఈ క్రమంలో వారం క్రితం సర్వశిక్ష అభియాన్ ఏఎంవో శాంతికుమారి, ఎంఈవో-2 శివకుమార్‌లు పాఠశాలను పరిశీలించారు. వర్షం కురిస్తే అందులో కూర్చోవద్దని హెచ్‌ఎంకు, విద్యార్థులకు సూచించారు. తగిన చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని ఆమె తెలిపారు. వరండా పిల్లర్లు కూడా బలహీనంగా ఉన్నాయని గ్రామ టీడీపీ నాయకుడు పూరిమిట్ల మాల్యాద్రి చెప్పారు. ఈ విషయాన్ని ఆయన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన నెల్లూరులోని విద్యాశాఖ అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయినా ఇంతవరకు ఇక్కడ ఎలాంటి చర్యలు తీసుకోలేదు.


శిథిలావస్థకు చేరిన చినపవని ఎస్సీ కాలనీ పాఠశాల

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ

కావలి,ఆగస్టు5 : తహసీల్దార్‌గా పీ. శ్రావణ్‌కుమార్ సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సమయంలో వచ్చిన నగేష్ సొంతజిల్లాకు వెళ్లటంతో ఆ స్థానంలో శ్రావణ్‌కుమార్ వచ్చారు. డీటీగా ఉంటూ సెలవులో ఉన్న ఆయనకు పదోన్నతినిచ్చి తహసీల్దార్‌గా నియమించారు.

అల్లూరు : తహసీల్దారుగా ఏ. లక్ష్మీ నారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది ఆయనకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో డీటీ నాగలక్ష్మి, సిబ్బంది సుధీర్, ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర పాల్గొన్నారు.

వలేటివారిపాలెం : తహసీల్దార్‌గా షేక్ అబ్దుల్‌అమీద్ సోమవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఆయన ప్రకాశం జిల్లా తర్లుపాడు తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయనకు ఇన్‌చార్జి తహసీల్దార్ విజయ్‌భాస్కర్, ఆర్ఐ ప్రసాద్ పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

ఉలవపాడు : తహసీల్దార్‌గా వీ లావణ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రకాశం కలెక్టరేట్ నుంచి ఆమె బదిలీపై వచ్చారు. డీటీ వీరయ్య, రీసర్వే డీటీ రామమూర్తి, వీఆర్వోలు, కార్యాలయం సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపి, స్వాగతం పలికారు. తొలిరోజు ఆమె వీఆర్వోలతో సమీక్ష నిర్వహించారు.

కొండాపురం : తహసీల్దార్‌గా కేవీబీటీ సుందరమ్మ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల సమయంలో తహసీల్దారుగా పనిచేసిన మస్తానయ్య బదిలీ కావడంతో ప్రకాశం జిల్లా నుంచి సుందరమ్మ ఇక్కడికి వచ్చారు. టీడీపీ నేతలు యారవ క్రిష్టయ్య, పోలినేని రమేష్, రామమోహన్, అల్లిక మధు తదితరులు ఆమెను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

బిట్రగుంట : తహసీల్దారుగా ఎం.సురేష్‌బాబు సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు డీటీ జూలియాభాయ్, రెవెన్యూ అధికారులు శాలువా కప్పి పూలమాలలతో స్వాగతం పలికారు.

స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్‌కు జేబీ విద్యార్థులు

కావలిటౌన్, ఆగస్టు5: జేబీ డిగ్రీ కళా శాల ఎన్‌సీసీ క్యాడెట్లు స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్‌కు ఎంపి కయ్యారు. సోమవారం ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం నాయుడు అధ్యక్షతన జరిగిన అభినందన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి పాల్గొని, క్యాడెట్లకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ నెల 15న విజయవాడలో జరగనున్న స్వాతంత్ర్య పరేడ్‌లో పాల్గొనేందుకు తమ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు కే కొండబాబు, కే సాగర్, వై రఘువీరసింహ ఎంపికవడం సంతోషంగా ఉందన్నారు. ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ జే కిరణ్‌కుమార్ సరైన శిక్షణ అందించి ఎంపికయ్యేందుకు దోహదపడ్డారని తెలిపారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సు డైరెక్టర్ ఆర్ మాల్యాద్రి, పలువురు అధ్యాపకులు కూడా క్యాడెట్లను అభినందించారు.

రేపటి నుంచి రాములోరి తిరునాళ్ల

కావలి రూరల్, ఆగస్టు5: కావలి మండలం గుమ్మడిబందల గ్రామంలో బుధవారం నుంచి ఈనెల 9వతేదీ వరకు రాములోరి తిరునాళ్ల నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే 10, 11 తేదీల్లో అంకమ్మ తిరునాళ్ల నిర్వహిస్తామన్నారు. ఆదివారం అమ్మవారికి పొంగళ్లు పెడతామని పేర్కొన్నారు. ఏడేళ్ల తరువాత నిర్వహించే ఈ తిరునాళ్లలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

రేపు రౌండ్‌టేబుల్ సమావేశం

ఉలవపాడు, ఆగస్టు 5: కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో కలపాలని, మార్కాపురాన్ని జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం ఒంగోలులోని ఎంసీఏ భవనంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రబాబు హామీ మేరకు త్వరితగతిన కార్యచరణ చేపట్టాలని, లేనిపక్షంలో ఉద్యమబాట చేపట్టేందుకు వెనుకాడబోమని ఆయన పేర్కొన్నారు.

హిందు శ్మశానవాటికను అభివృద్ధి చేయండి

కావలిటౌన్, ఆగస్టు5: పట్టణంలోని ముసునూరు హిందు శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని సంజీవని ఫౌండేషన్ అధ్యక్షుడు కనుమూరు భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానికులతో కలిసి ఆయన ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్‌లకు వినతిపత్రాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ హిందు శ్మశానవాటిక 62 సెంట్లలో ఉండేదని, హైవే బైపాస్‌కు కొంతస్థలం పోగా, ప్రస్తుతం 40 సెంట్లలో ఉందన్నారు. చుట్టూ ప్రహరీ నిర్మించి, కాల్చుల కోసం మండపం, స్నానాల వసతి, దుస్తులు మార్చుకునే గది నిర్మాణం చేపట్టాలని కోరారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 8 అర్జీలు

కందుకూరు, ఆగస్టు 5: మున్సిపాలిటీలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 8 అర్జీలు వచ్చినట్లు కమిషనర్ కేవీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా సెక్షన్ హెడ్స్‌కు ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. వీధిలైట్లు, తాగునీరు, పారిశుధ్యం తదితర సమస్యలపై 91777 00267 నెంబరుకు ఫోన్ చేస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం, ఆగస్టు 5 : మండలంలోని అన్నెబోయినపల్లి సమీపంలోని మన్నేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఎస్‌హెచ్‌వో ఏ మల్లికార్జున, పోలీసు సిబ్బందిని పంపించి ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని, డ్రైవర్‌ను, ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

శాస్త్రీయంగా మిరప నారు పెంపకంపై శిక్షణ

లింగసముద్రం, ఆగస్టు 5 : శాస్త్రీయంగా మిరప నారు పెంపకంపై సోమవారం కందుకూరు కృషి విజాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జీ ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ ఇచ్చారు. స్థానిక అంబేడ్కర్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నారుమళ్లు మీటరు వెడల్పు, 15 సెంటీమీటర్లు ఎత్తు ఉండేలా చేసుకొని, మధ్యలో 30 సెం.మీ కాలువలు తీసుకోవాలన్నారు.అలాగే నారు నాటే పొలాల్లో జనుము, జీలుగ వంటి పచ్చిరొట్ట పైర్లను చల్లుకొని పూతదశలో కలియదున్నుకోవాలన్నారు. తద్వారా ద్వారా నేలలో సేంద్రీయ కర్బణం పెరిగి మిరపలో అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా విత్తనశుద్ధి గురించి, మిరపనారులో సస్యరక్షణ చర్యలు గురించి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటేష్, డాక్టర్ జ్యోతి, ఇంజనీరు వివేక్, మైరాడ ఎన్‌జీవో సభ్యులు మల్లికార్జున, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి టీజీ భరత్ జన్మదిన వేడుకలు

కందుకూరు, ఆగస్టు 5: రాష్ట్రమంత్రి టీజీ భరత్ జన్మదిన వేడుకలను స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించారు. పట్టణ ఆర్యవైశ్యులు ఏర్పాటుచేసిన కేక్‌ను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రతినిధులు పబ్బి శెట్టి రాజా, ఇస్కాల సురేంద్ర, ఇస్కాల మధు, నల్లమల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేత

కందుకూరు, ఆగస్టు 5: సనాతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం గుడ్లూరు మండలం చేవూరు ఎస్సీ కాలనీకి చెందిన వాదనాల నారయ్య అనే దివ్యాంగుడికి స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ట్రైసైకిల్ అందజేశారు. ఎన్ఆర్ఐ డాక్టరు భవినేని అరుణ ట్రైసైకిల్, గుంటూరుకు చెందిన పీ లక్ష్మి నిత్యావసరాలు సమకూర్చగా వాటిని ఫౌండేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే చేతుల మీదుగా దివ్యాంగుడికి అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు బొద్దుకూరి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగుడికి ట్రైసైకిల్, నిత్యావసరాలు అందచేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

ప్రజాదర్బార్‌లో సమస్యలకు సత్వర పరిష్కారం

కలిగిరి, ఆగస్టు 5: టీడీపీ ప్రధాన కార్యాలయం మంగళగిరిలో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమంతో ప్రజాసమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు తెలిపారు. సోమవారం బొల్లినేని ఫోన్‌లో మాట్లాడుతూ పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్‌తో కలిసి ప్రజాదర్బార్ గ్రీవెన్స్‌లో వినతులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయగిరి నియోజకవర్గం నుంచి సుమారు 100మందికిపైగా వివిధ సమస్యలపై తనను కలిసినట్లు ఆయన తెలిపారు.


వినతులు స్వీకరిస్తున్న బొల్లినేని, అజీజ్ తదితరులు

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

కావలిటౌన్, ఆగస్టు5: వయనాడ్ వరద బాధితుల సహాయార్థం సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో విరాళాలు సేకరించారు. పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ వయనాడ్ వరద బాధితుల కోసం రెండు రోజులపాటు విరాళాలు సేకరించమని పార్టీ ఆదేశించిందన్నారు. వయనాడ్ విపత్తును జాతీయ విపత్తుగా కేంద్రం ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో తిరుపాల్, కృష్ణయ్య, చెన్నయ్య, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం కార్యకర్తలు

బ్రిడ్జిపై గుంతలు పూడ్చండి

కొండాపురం, ఆగస్టు 5: బ్రిడ్జిపై గుంతలు పూడ్చాలంటూ మండలంలోని సాయిపేట గ్రామస్థులు ఆర్‌అండ్‌బీ అధికారులను కోరుతున్నారు. గ్రామం మధ్యలో నుంచి వెళ్తున్న ప్రధాన రహదారిలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉన్న బ్రిడ్జిపై రెండు వైపులా గుంతలు పడి ఉన్నాయి. వీటిని వాహన చోదకులు గమనించాలని స్థానికులు రెండువైపులా జెండాలు కట్టారు. రాత్రిళ్లు వాహనచోదకులు గమనించకుండా వెళితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు గుంతలు పూడ్చాలని వారు కోరుతున్నారు.


బ్రిడ్జిపై గుంత వద్ద జెండా కట్టిన స్థానికులు

ఒరిగిన విద్యుత్ స్తంభాలు.. పొంచి ఉన్న ప్రమాదాలు

వలేటివారిపాలెం, ఆగస్టు 5 : వలేటివారిపాలెం నుంచి చుండి గ్రామం వైపు వెళ్లే జాతీయ రహదారి పక్కన ఉన్న పొలాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి ఉన్నాయి. వీటి వల్ల ప్రమాదాలు పొంచి ఉన్నాయని రైతులు, కూలీలు ఆందోళన చెందుతున్నారు. అయినా విద్యుత్ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడడంలేదని వారంటున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. రైతులు, కూలీలు పనుల నిమిత్తం పొలాల్లోనే ఉంటున్నారు. వర్షంతోపాటు ఉరుములు, మెరుపులు, పెనుగాలులు వీస్తున్నాయి. పెనుగాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగే అవకాశాలు ఉన్నాయి. అలాంటి సమయంలో రైతులు, కూలీలతోపాటు పశువులు కూడా ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. ప్రమాదాలు జరక్కముందే అధికారులు విద్యుత్ స్తంభాలను సరిచేయాల్సి ఉంది.


పొలాల్లో ఒరిగిన విద్యుత్ స్తంభం

కావలిలో యథేచ్ఛగా రోడ్డు ఆక్రమణలు

కావలి,ఆగస్టు5: పట్టణంలోని ఉదయగిరి బ్రిడ్జి కూడలిలో ట్రంకురోడ్డు మలుపు వద్ద యథేచ్ఛగా రోడ్డును ఆక్రమించి, నిర్మాణాలు చేపట్టినా అధికారులు పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఆర్వోబీ దక్షిణం వైపు అప్రోచ్‌రోడ్డు, ట్రంకురోడ్డు వైపు పూర్తిగా ఆక్రమించినా పక్కనే ఉన్న పోలీసులు కానీ, మున్సిపల్ అధికారులు కానీ స్పందించడంలేదు. అక్కడ ఇటీవల కొత్తగా షాపులు నిర్మించిన వారు వాటిని అద్దెకు ఇచ్చారు. అద్దెకు తీసుకున్న వారు అక్కడ దుకాణాల ముందు ఉన్న డ్రైనేజీని ఆక్రమించి దానిపై మూత బండలు వేసి నిర్మాణాలు చేపట్టారు. డ్రైనేజీ కాలువను శాశ్వతంగా ఆక్రమించటంతో మురుగునీరు పారుదల సమస్యలు ఏర్పడనున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి అక్కడ ఆక్రమణలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు : రోడ్డుపైకి వచ్చిన ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

- ఎస్. బాబూరావు, పట్టణ ప్రణాళిక అధికారి

వైసీపీ పాలనలో పేదల గృహ నిర్మాణాల్లో అవినీతి

- నగదు ఇస్తే పాత ఇళ్లకైనా బిల్లుల మంజూరు
- నిజమైన లబ్ధిదారులకు అందని ఇళ్లు

పొదలకూరు, ఆగస్టు 5: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పక్కా గృహాల నిర్మాణంలో అక్రమాలు జరిగాయని, మండలంలో 2022 ఏప్రిల్ నుంచి 2024 మార్చి మధ్య మంజూరైన ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి భారీ ఎత్తున అవినీతి జరిగిందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని నిజమైన లబ్ధిదారులకు ఇళ్లు అందలేదు కానీ అధికారులు ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఇళ్లు కట్టకుండానే, ఎప్పుడో కట్టుకున్న పాత ఇళ్లకు సైతం మొత్తం డబ్బులు ఖాతాలో జమ అయ్యాయనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. మండలంలోని చాటగొట్ల, మొగళ్లూరు, మరుపూరు, తోడేరు, బిరదవోలు, తాటిపర్తి, అయ్యగారిపాలెం, పొదలకూరు బిట్ - 2, 3, 4 సచివాలయాల పరిధిలోని కొన్ని పక్కాగృహాల నిర్మాణాల్లో పెద్దఎత్తున అవినీతి జరిగిందని, ఆ ఇళ్లకు సంబంధించిన బిల్లులు మంజూరు కాగానే ప్రధాన భాగం తిరిగి దక్షిణ రూపంలో అధికారులకు చేరాయని సమాచారం. కాగా, పాత ఇల్లుకైనా అధికారులను మెప్పించి బిల్లులు మంజూరు చేయించడంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ కీలక పాత్ర పోషించినట్లు అతని నుంచి లబ్ధి పొందినవారే చెబుతున్నారు. నాలుగు నెలల క్రితం పొదలకూరు మండల హౌసింగ్ శాఖలో జరిగిన అవినీతిపై డీఈ విచారణ చేపట్టి అప్పట్లో నివేదికను కూడా సమర్పించారు. అయితే ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. నూతన ప్రభుత్వంలోనైనా హౌసింగ్ శాఖలో జరిగిన అక్రమాలపై ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని మండల వాసులు కోరుతున్నారు.

కళాశాలల తనిఖీ

వెంకటాచలం, ఆగస్టు 5: విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలో ఉన్న కళాశాలలను సోమవారం వీఎస్‌యూ ఇన్‌చార్జ్ వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా సంజీవిని డిగ్రీ కళాశాల, రావూస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజిమెంట్ స్టడీస్, జగన్స్ కళాశాలను తనిఖీ చేసి మౌలిక వసతులు, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల పనితీరు, ఇంటర్నల్ పరీక్షలను పరిశీలించారు. ఆయన వెంట వర్సిటీ డీన్ డాక్టర్ ఎం ఉస్సే నయ్య తదితరులున్నారు.

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో విజయం సాధించాలి

విడవలూరు, ఆగస్టు 5: రెండురోజుల్లో జరగనున్న విద్యాకమిటీ ఎన్నికల్లో విజయం సాధించాలని టీడీపీ మండలాధ్యక్షుడు చెముకుల శ్రీనివాసులు తెలిపారు. విడవలూరులోని పార్టీ కార్యాలయంలో టీడీపీ నేతలతో అయన సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని సుమారు 80 పాఠశాలల్లో ఎన్నికలు జరగనున్నాయని కమిటీ ఛైర్మన్లుగా మంచి వ్యక్తులను ఎన్నుకోవాలన్నారు. దాదాపుగా ఏకగ్రీవం దిశగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, మాతూరు శ్రీనివాసులురెడ్డి, సత్యంరెడ్డి, చిల్లకూరు వేణు, చెముకుల వేణు, పాల్గొన్నారు.

భాషా వారోత్సవాల ప్రారంభం

ముత్తుకూరు, ఆగస్టు 5: కృష్ణపట్నంలోని అదాని వరల్డ్ స్కూల్‌లో సోమవారం భాషా వారోత్సవాలను అదాని వరల్డ్ స్కూల్, అదాని సైనిక్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ సిరియాల జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం అకాడమిక్ హెడ్‌తో కలిసి వారోత్సవాల బ్యానర్‌ని ఆవిష్కరించారు. విద్యార్థులు నృత్యాలు చేసి అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపా..ధ్యాయ బృందం, సహోపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకు హద్దులు చూపండి

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 5: తమకు కేటాయించిన ఇళ్ల స్థలాలకు హద్దులు చూపించాలని పలువురు కళాకారులు సోమవారం డిప్యూటీ తహసీల్దారు ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు. బుచ్చి, దగదర్తి, సంగం మండలాల్లోని పలువురు కళాకారులకు మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో ఇళ్లస్థలాలు కేటాయించారు తప్ప వాటికి హద్దులు ఏర్పాటు చేయలేదన్నారు. పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకపోయిందని, ఇప్పటికైనా హద్దులు ఏర్పాటుచేసి ఇళ్లు మంజూరు చేయాలని కళాకారులు చెన్నారెడ్డి గోపాల్‌రెడ్డి, మన్నేపల్లి కృష్ణయ్య, శ్రీధర్‌రెడ్డి కోరారు.

మహిళకు ఆర్థికసాయం

మనుబోలు, ఆగస్టు 5: మండలంలోని వీరంపల్లి పంచాయతీలోని కొండుపాళెంలో సోమవారం పోతు గుంట గాలీబీ అనే మహిళకు గ్రామ టీడీపీ నాయకులు రూ. పదివేల ఆర్థిక సాయం అందించారు. కొంతకాలంగా గాలీబీ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. దీంతో ఆమె వైద్యఖర్చుల నిమిత్తం టీడీపీ నాయకులు పొట్టేళ్ల ప్రసాద్, రఘురామయ్య, అమీర్‌భాషా, వేణురెడ్డి, రామకృష్ణ, ఆంజనేయులు ఆర్థిక సాయం అందించి ఆమెకు ధైర్యం చెప్పారు.

చెరుకుమూడిలో రూ.40 కోట్ల భూ కుంభకోణం

- కలెక్టర్ విచారణ చేయించాలి : ఎమ్మెల్యే సోమిరెడ్డి



కబ్జా స్థలాన్ని ఎమ్మెల్యే సోమిరెడ్డికి చూపుతున్న డీటీ

మనుబోలు, ఆగస్టు 5: మండలంలోని చెరుకుమూడి రెవెన్యూలో రూ. 40 కోట్ల భారీ భూ కుంభకోణం జరిగిందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన కొమ్మలపూడి క్రాస్‌రోడ్డు సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఎంతమేర ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనవో కొమ్మలపూడి గ్రామస్థులను, డీటీని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొమ్మలపూడికి చెందిన వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి కాకాణి అనుచరుడు చెందులూరు శ్రీనువాసులు, ఆయన కుటుంబసభ్యుల పేరుతో కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాజేశారన్నారు. కలెక్టర్ వెంటనే దీనిపై స్పందించి విచారణ చేయించాలన్నారు. రాబోయే రెండు, మూడు నెలల్లో ఇంకా ఇలాంటి కుంభకోణాలు బయటపడనున్నాయన్నారు. కలెక్టర్ విచారించి బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేయాలన్నారు. ఆక్రమణలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, జిల్లా నాయకులు పొన్నూరు రామకృష్ణయ్య, నాయకులు మన్నెమాల ఆదినారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీ పెంచలయ్య, హరిబాబు, వెందోటి భాస్కర్‌రెడ్డి, సూరిశెట్టి నాగేశ్వరరావు, సాని వెంకటరమణయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఇందుకూరుపేట, ఆగస్టు 5: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కైలాసం శ్రీనివాసులురెడ్డి తెలిపారు. కొత్తూరులో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కుడితిపాలెం, రాముడుపాలెం, గంగపట్నం, మైపాడు, కొరుటూరు, కోస్తా తీర ప్రాంతాలలో నీటి సమస్యను స్థానిక ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే కుడితిపాలెం, గంగపట్నం, నర్సాపురం గ్రామాల్లో ఇళ్ల స్థలాల సమస్యలపై ఎంపీ ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఆయా లబ్ధిదారులకు ఇళ్లస్థలాలు మంజూరు చేయుటకు కృషిచేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్యకార సెల్ అధ్యక్షుడు చెంచంగారి గాంధీ, బీజేపీ నాయకులు శ్రీనివాసులు, వెంకట్రావు, కేతిరెడ్డి అవినాష్‌రెడ్డి, కోసూరు వెంకటరమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

మనుబోలు తహసీల్దార్‌గా సుబ్బయ్య

మనుబోలు : తహసీల్దార్‌గా సీహెచ్ సుబ్బయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించడంతోపాటు ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు.

- **పొదలకూరు :** నూతన తహసీల్దారుగా మలిశెట్టి సారంగపాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలపై దృష్టి సారించి ప్రజలకు సత్వర సేవలందిస్తానన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు షేక్ జమీర్‌బాషా, షేక్ ఖాదర్‌బాషా ప్రభాకర్‌రెడ్డి, గాలి శ్రీనివాసులు తదితరులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.
- **వెంకటాచలం :** తహసీల్దార్‌గా ఎన్ శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. ఎన్డీఏ కూటమి నేతలు ఆయన్ను కలిసి సత్కరించారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు కలిసి అభినందనలు తెలిపారు.
- **తోటపల్లిగూడూరు :** తహసీల్దారుగా ఎం పద్మజ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు, రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

జొన్నవాడలో నేటి నుంచి కాత్యాయనీ వ్రతం

బుచ్చిరెడ్డిపాళెం : శ్రావణమాసం సందర్భంగా జొన్నవాడ ఆలయంలో మంగళ, శుక్రవారాలలో కాత్యాయనీ వ్రతం నిర్వహిస్తున్నట్లు ఈఓ ఏవీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. 4 మంగళవారాలలో కాత్యాయనీ వ్రతం, 9వ తేదీ మొదటి శుక్రవారం లక్ష కుంకుమార్చన, 2వ శుక్రవారం సామూహిక వరలక్ష్మీవ్రతం, 3వ శుక్రవారం లక్షకుంకుమార్చన, 4వ శుక్రవారం లక్షకుంకుమార్చన పూజలు జరుగుతాయని ఈఓ తెలిపారు.

వయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణ



కోవూరులో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

కోవూరు, ఆగస్టు 5: భారీ వర్షాలకు అతలా కుతలమైన కేరళ రాష్ట్రంలోని వయనాడ్ బాధితుల కోసం సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు సోమవారం పట్టణంలో విరాళాలు సేకరించారు. చిన్నపడుగుపాడు కూడలి నుంచి కోవూరులోని మండబయలు కూడలి వరకు ప్రదర్శన చేపట్టి విరాళాలు సేకరించారు. చిరువ్యాపారులు రూ10,100 అందచేశారు. విరాళాల సేకరణలో సీపీఎం నాయకులు గండవరపు శేషయ్య, చాంద్‌బాష, బుజ్జయ్య, రత్నమ్మ, బాబు, సుబ్బారావు, వెంకటేష్ పాల్గొన్నారు.

- **బుచ్చిరెడ్డిపాళెం:** కేరళ వరద బాధితులను ఆదుకోవడం కోసం బుచ్చిరెడ్డిపాళెంలో సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం విరాళాలు సేకరించారు. విరాళాల సేకరణలో సీపీఎం నాయకులు పోతంశెట్టి శ్రీనివాసులు, షేక్ జానీభాష, షేక్ మునీర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం గ్రామంలో నీటి సమస్య పరిష్కరించాలి

కొడవలూరు, ఆగస్టు 5: మండలంలో దామేగుంట పంచాయతీ పరిధిలో చలివేంద్రం గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని టీడీపీ సీనియర్ నాయకుడు తలపల మూరళీ కోరారు. సోమవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత మూడురోజులుగా చలివేంద్రం గ్రామంలో తాగునీరు లేక 2 కి.మి కాలినడక వెళ్లి తెచ్చుకుంటున్నారని అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు

విడవలూరు, ఆగస్టు 5: అలగానిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఆరోగ్యమే మహాభాగ్యం కార్యక్రమంలో భాగంగా శ్యామలాదేవి కళాబృందం వ్యాధులు ప్రబలకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు శీలు శేషయ్య, టీడీపీ నాయకులు కృష్ణ, పంచాయతీ కార్యదర్శి రాధాకుమారి, కళాబృందం సభ్యులు శ్యామలాదేవి, సురేష్, రవి పాల్గొన్నారు.





ఆకతాయిలకు పోలీసుల మందలింపు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 5: బుచ్చిరెడ్డిపాళెంలో ఆకతాయిల ఆగడాలు రోజురోజుకు పెచ్చుమీరుతున్నాయి. సోమవారం బుచ్చిలోని చలివేంద్రం సెంటర్‌లో నెంబర్లాట ఆడుతున్న పలువురు ఆకతాయిలను పోలీసులు అదుపులోకి తీసుకుని మందలించారు. బుచ్చిలో నిత్యం పలువురు ఆకతాయిలు గంజాయి, మద్యం మత్తులో దారినపోయే మహిళలు, యువతులు, బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ భయాందోళనకు గురిచేస్తున్నారని, బుచ్చిలోని పాఠశాలలు, కళాశాలలు వద్ద పోలీసుల నిఘా ఏర్పాటుచేసి ఆకతాయిల ఆగడాలను అరికట్టాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అన్నీ లొసుగులే..!



- పంచాయతీల పద్దుల్లో లోపాలు
- సజ్జాపురంలో రూ.3.22 లక్షలకు లెక్కలేవి?
- పెనుబర్తిలో భర్త ఖాతాకు నిధుల మళ్లింపు
- అజెండాలో లేని అంశాలకు ప్రాధాన్యత
- సర్పంచులకు డీపీవో షోకాజు నోటీసుల జారీ

నెల్లూరు రూరల్, ఆగస్టు 5 : నెల్లూరు రూరల్ మండలంలోని సజ్జాపురం, పెనుబర్తి గ్రామ పంచాయతీల్లో నిధులు భారీగా దుర్వినియోగం జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తు ద్వారా గుర్తించారు. పంచాయతీ సమావేశాల్లో అజెండాలో లేని అంశాలకు ప్రాధాన్యత కల్పించారంటూ ఆక్షేపిస్తూ జిల్లా పంచాయతీ అధికారి సుస్మితారెడ్డి ఆ సర్పంచులకు ఈ నెల 3న షోకాజు నోటీసులు జారీ చేశారు. ఇవీ సోమవారం వెలుగులోకి రావడంతో ఆయా పంచాతీల్లో అలజడి రేగింది. గ్రామ పంచాయతీల్లో జరిగిన నిధుల దుర్వినియోగంపై పలువురు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు జిల్లా పంచాయతీ అధికారులు విచారణ చేపట్టి అవకతవకలను గుర్తించారు. సజ్జాపురం సర్పంచు అప్పుకూటి నారాయణ పంచాయతీలోని సాధారణ నిధులు రూ.1.97 లక్షలు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.25 లక్షలు మొత్తంగా రూ.3.22 లక్షలు డ్రా చేశారు. కానీ అందుకు సంబంధించి లెక్కలు ఎక్కడా ఖాతాల్లో చూపలేదని, సదరు సర్పంచు తీవ్రమైన ఆర్థిక దుర్వినియోగానికి పాల్పడినట్లు డీఎల్‌పీవో శ్రీనివాసరావుతో నిర్వహించిన ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు పేర్కొన్న డీపీవో సుస్మితారెడ్డి అందుకు వివరణ కోరుతూ షోకాజు నోటీసు జారీ చేశారు. అలాగే పెనుబర్తి గ్రామానికి చెందిన పీ జస్వంత్‌కుమార్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై డీఎల్‌పీవోతో విచారణ జరిపించగా పెనుబర్తి గ్రామానికి చెందిన సర్పంచు వెదనపర్తి సుజన పంచాయతీ ఖాతాలోని నిధులు తన భర్త ఉపసర్పంచు వెంకటేశ్వర్లురెడ్డి ఖాతాలోకి బదిలీ చేసినట్లు డీఎల్‌పీవో తనిఖీల్లో తేలినట్లు డీపీవో షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు. 2021-22 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరాలకు చెందిన వివిధ పనుల నిధులు రూ.30.13 లక్షలు, సాధారణ నిధులు రూ.7.86 లక్షలు ఆమె తన భర్త ఖాతాకు బదిలీ చేయించారని డీపీవో నోటీసుల్లో పేర్కొనగా, సాధారణ నిధుల్లో రూ. 99 వేలుకు ఎలాంటి లెక్కలు లేవని గుర్తించారు. ఈ షోకాజు నోటీసులు అందుకున్నాక లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని డీపీవో కోరారు.

శ్రావణమాసం పూజలు ప్రారంభం

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 5 : శ్రావణ మాసం సోమవారం ప్రారంభమైంది. దీంతో శివాలయాల్లో మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు, పూలంగిసేవలు జరిగాయి. శ్రావణ మాసం తొలిరోజు ఆలయ దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరాలయం, నీలకంఠేశ్వరస్వామి ఆలయం, రాజరాజేశ్వరి ఆలయంలో సుందరేశ్వరస్వామి ఆలయం, అష్టలక్ష్మీ ఆలయంలో ఉమామహేశ్వర స్వామి ఆలయం, వాహబ్‌పేట, ఉస్మాన్ సాహెబ్‌పేట ప్రాంతాల్లో శివాలయాల్లో మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

- **రాజరాజేశ్వరి ఆలయంలో...**

నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో శ్రావణ మాసంలో ప్రతి రోజూ విశేష పూజలు, వ్రతాలు జరుగుతాయని ఆలయ చైర్మన్ రత్నంజయరామ్, సహాయ కమిషనర్ బీ.వెంకటసుబ్బయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు. 9, 16, 19, 23, 30వ తేదీలలో లక్ష కుంకుమార్చనలు, 16న సామూహిక వరలక్ష్మీవ్రతం జరుగుతుందని తెలిపారు. 13, 20, 27వ తేదీలలో కాత్యాయినీ వ్రతాలు జరుగుతాయని పేర్కొన్నారు. 19న శ్రావణ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి సుగంధ ద్రవ్యాలు, పసుపు కుంకుమలతో అభిషేకాలు జరుగుతాయని తెలిపారు. 30న చివరి శుక్రవారం ప్రత్యేక అలంకారం జరుగుతుందని తెలిపారు.

- **ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో..**

నగరంలోని మాగుంట లే అవుట్‌లో వెలసిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాసం వేడుకలు ఘనంగా జరుగుతాయని ఆలయ చైర్మన్ శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 7న గోదాదేవి తిరునక్షత్రం పూజలు, దివ్య ప్రబంధ పారాయణాలు, 8న పద్మావతిదేవికి అభిషేకం, 9న గరుడ ఆళ్వార్ సహిత అనంత నాగరాజు స్వామికి తిరుమంజనం, రాత్రి గరుడ సేవ, 10 శ్రీసుదర్శన నరసింహహోమం, 15న ఉదయం తిరుమంజనం, రాత్రి గరుడసేవ, 23న పద్మావతి తాయారులకు సామూహిక కుంకుమార్చన, 27న శ్రీకృష్ణాష్టమి సందర్భంగా శ్రీకృష్ణ ఉత్సవమూర్తికి తిరుమంజనం జరుగుతుందని పేర్కొన్నారు.

- **ఆండాళ్‌కి ప్రాకారోత్సవం**

రంగనాథస్వామి ఆలయంలో అండాళ్ తాయార్ తిరువాడి పూడి ఉత్సవాల్లో సోమవారం ఉదయం తిరుమంజనం, విశేష పూజలు, సాయంత్రం ప్రాకారోత్సవం, మాలలమార్పిడి, ఊంజల్‌సేవ జరిగాయి. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

రాజకీయ కక్ష సాధింపులు సహించను

- రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, ఆగస్టు 5 : అధికారం ఉందని ఎవరైనా రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడితే ఊరుకునే ప్రసక్తేలేదని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం 37వ డివిజన్ రాంనగర్‌లో రూ.20 లక్షలతో చేపట్టను న్న సీసీరోడ్ల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ప్రజలు మనమీద చాలానమ్మకంతో అధికారం ఇచ్చారని, అభివృద్ధి చేసి వారి రుణం తీర్చుకోవాలే తప్ప కక్ష సాధింపులకు పాల్పడవద్దని చెప్పారు. మాజీ మేయర్ భానుశ్రీ విజ్ఞప్తి మేరకు మరో రూ. 50 లక్షల నిధులను ఈ డివిజన్‌కు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భానుశ్రీ, జలదంకి సుధాకర్, మధుసూదన్‌రెడ్డి, విజయ్, వినోద్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

- **సినీనటుడి జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే**

నెల్లూరు(సాంస్కృతికం) : నెల్లూరులో సోమవారం జరిగిన దిల్ దివానే ఫేం ద్వారా పరిచయమైన సినీ హీరో రోహిత్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రోహిత్‌రెడ్డి తండ్రి న్యాయవాది ఎం.రవీందర్‌రెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి, నూకరాజు మదన్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకం

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 5 : భారత రాజ్యాంగం 340 ఆర్టికల్ ప్రకారంగానీ, ఆర్టికల్ 14, 16 ప్రకారం ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకమని, ఈ విషయాన్ని జస్టిస్ ఉషామోహన్ తెలిపారని, సుప్రీంకోర్టు తీర్పును తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వర్ణా వెంకయ్య తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. వర్గీకరణ విభజన అశాస్త్రీయమైనదని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ప్రభావితమైన ఈ తీర్పును అమలును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యోగుల సంఘాల ప్రధాన కార్యదర్శి కట్టేటి మోహనకృష్ణ, జిల్లా అధ్యక్షుడు బల్లి వెంకయ్య, జిల్లా యువత అధ్యక్షుడు బలి శరత్‌కుమార్, పాలకీర్తి రవి, తదితరులు పాల్గొన్నారు.

నగరంలోకి సిమెంట్ ట్యాంకర్లు రానీయొద్దు

- డీఆర్వోకు సీపీఎం నేతల వినతి



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నేతలు

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 5 : నెల్లూరు నగరంలోని చిల్డ్రన్స్ పార్క్ వైపు భారీ సిమెంట్ ట్యాంకర్లు రాకుండా కట్టడి చెయ్యాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో డీఆర్వో లవన్నకు వినతి పత్రం అందజేశారు. సీపీఎం నేత కాయం శ్రీనివాసులు మాట్లాడుతూ చిల్డ్రన్స్ పార్క్ వైపు వచ్చే సిమెంట్ ట్యాంకర్ల వల్ల ముత్తుకూరు గేట్ సెంటర్‌లో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుందని చెప్పారు. ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే వాహనాలు ఇటువైపు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు వెంకటేశ్వర్లు, సంపూర్ణమ్మ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయం

- డిప్యూటీ ఈవో ప్రసన్నలక్ష్మి

నెల్లూరు(విద్య), ఆగస్టు 5 : పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయమని నెల్లూరు డిప్యూటీ ఈవో ప్రసన్నలక్ష్మి తెలిపారు. పూర్వ విద్యార్థులంతా కలిసి ఏర్పాటు చేసుకున్న 91 ఫౌండేషన్‌కు చెందిన సభ్యురాలు తమ్మిరెడ్డి రాధికారెడ్డి నగరంలోని కొండాయపాళెం నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలకు సోమవారం మైక్‌సెట్, నోట్ పుస్తకాలను అందచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ ఈవో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం.భాస్కర్ రావు, 91 ఫౌండేషన్ సభ్యులు చంద్ర, సింహా, లక్ష్మీ, రాజ్యలక్ష్మీ, శ్రీలత, భారతి, దేవా, శ్రీను, భాస్కర్, కేశవ, ఉపాధ్యాయులు హరీష్, కిరణ్ పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో సమస్యల పరిష్కారం : ఏడీసీ



సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

నెల్లూరు(సిటీ), ఆగస్టు 5 : నగర వాసుల నుంచి అందిన వినతులన్నీటిని నిర్ణీత సమయంలోపు పరిష్కరిస్తామని ఏడీసీ శర్మద అన్నారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆమె ప్రజల నుంచి అర్జీల స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు నుంచి అందిన వినతిని స్వీకరించే అధికారి వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఈ ప్రక్రియ నిర్ణీత కాలవ్యవధిలో జరగాలన్నారు. కమిషనర్ ప్రతి వినతిని ఆన్‌లైన్‌లో పర్యవేక్షిస్తారని తెలిపారు.

నెల్లూరు అర్బన్, రూరల్ తహసీల్దార్లు బాధ్యతల స్వీకరణ



షఫీ మాలిక్



లాజరస్

నెల్లూరు(వెంకటేశ్వరపురం)/నెల్లూరురూరల్, ఆగస్టు 5: నెల్లూరు అర్బన్, రూరల్ మండలాల తహసీల్దార్లుగా నియమితులైన షేక్ షఫీమాలిక్, డీ లాజరస్‌లు ఆయా కార్యాలయాల్లో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే ఆర్డీవో కార్యాలయ ఏవోగా జీ.రాఘవేంద్రరావు బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గూంటురు జిల్లాకు బదిలీ అయ్యి తిరిగి జిల్లాకు వచ్చిన వీరికి పోస్టింగ్‌లు ఇచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వీరికి కార్యా లయ ఉద్యోగులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

చిన్నబజారు ఇన్‌స్పెక్టర్‌గా..



ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు

నెల్లూరు(క్రైం), అగస్టు 5: చిన్నబజారు పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా చిట్టెం కోటేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చిన్నబజారు పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న బీ అశోక్‌కుమార్ రేంజ్ కార్యాలయానికి బదిలీ కాగా ఆయన స్థానంలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న చిట్టెం కోటేశ్వరరావును నియమించారు. బాధ్యతలు చేపట్టిన కోటేశ్వరరావుకు స్థానిక ఎస్ఐలు సైదులు, లతీఫున్నీసా, సిబ్బంది పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, శక్తులతో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అనంతరం ఆయన ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, ప్రసాద్, నగర డిఎస్పీ డీ శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

సైకాలజిస్ట్ అభిషేక్‌కు భీష్మ వశిష్ట పురస్కారం

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 5 : నగరానికి చెందిన ప్రముఖ సైకాలజిస్ట్ అభిషేక్ సింగంశెట్టి వందే భారత్ ఫౌండేషన్ నుంచి ప్రతిష్టాత్మకమైన భీష్మవశిష్ట పురస్కారాన్ని సోమవారం కాకినాడలో అందుకున్నారు. ఈ పురస్కారానికి ఎంపిక చేసిన నిర్వాహకులు రమేష్, గుండా నిఖిల్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వివేక్ ఫౌండేషన్, జేసీఐ నెల్లూరు నగరం, లైన్స్‌కలబ్ ఆఫ్ పినాకిని సంస్థలకు అభినందనలు తెలిపారు.

దేవస్థానం విషయంలో రాజకీయాలొద్దు

నెల్లూరు రూరల్, ఆగస్టు 5 : దేవస్థానం విషయంలో రాజకీయాలు చేయవద్దని 2వ డివిజన్ కార్పొరేటర్ పడిగినేటి రామ్మోహన్‌కు గుడిపల్లిపాడు టీడీపీ నాయకులు సూచించారు. సోమవారం గుడిపల్లిపాడు శివాలయ ప్రాంగణం వద్ద నాయకులు మేకల అనిల్‌కుమార్, కనుపూరు వెంకటేష్, మేకల సురేష్, కడిం సుధాకర్‌లు మీడియాతో మాట్లాడారు. శివాలయం విషయంలో అనవసర రాజకీయాలు చేయకుండా కార్పోరేటర్‌గా హోదాకు తగ్గట్టుగా వ్యవహరిస్తే బాగుటుందని హితవు పలికారు. ఆలయానికి చెందిన మూడేళ్ల కౌలు డబ్బులకు ఉన్నా కనీసం పూజారి, చీపర్‌కు జీతాలు కూడా ఇవ్వడం లేదన్నారు. వైసీపీ అధికారంలో ఉన్న రోజుల్లో హుండీ లెక్క కూడా బయటకు రాకపోవడం ఆశ్చర్యకరంగా ఉందని, ఈ ఆలయ నిర్మాణం గ్రామస్థుల కష్టంతో ఏర్పడిందన్నారు.


జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వానికి విశేష స్పందన

నెల్లూరు,(స్టోన్‌హౌస్‌పేట), అగస్టు 5: జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా విశేష స్పందన లభించిందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ తెలిపారు. జనసేన పార్టీ జిల్లా పర్యవేక్షకుడు, జాతీయ మీడియా ప్రతినిధి వేములపాటి అజయ్ ఆదేశాల మేరకు నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం కార్యక్రమాన్ని జనసేన నాయకులు సోమవారం వేడుకగ నిర్వహించారు. నెల్లూరు నగరంలో 6వేలకు పైగా, జిల్లా వ్యాప్తంగా 30 వేలకు పైగా సభ్యత్వాలు నమోదు అయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అలేఖ్, హరి, మోనేష్, పేరయ్య, హేమచంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి వ్యాఖ్యలు హర్షణీయం

నెల్లూరు(క్రైం), అగస్టు 5: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో జరిగిన కలెక్టర్, ఎస్పీల సమీక్ష సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలు హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ పోలీస్ అధికారుల సంఘం అసోసియేట్ అధ్యక్షుడు వై శ్రీహరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ అధికారం ఉందని పెత్తందారులుగా ప్రవర్తించకుండా సహ ఉద్యోగులతో కలిసి పనిచేయాలని, వారిని అవమానించేలా మాట్లాడొద్దని, సమస్యలను కేవలం రూల్ పొజిషన్లో మాత్రమే చూడకుండా మానవతా దృక్పథం కోణంలో ఆలోచించి సమస్యను పరిష్కరించేలా చూడాలని వ్యాఖ్యలు చేశారన్నారు. ఈ వ్యాఖ్యలు కింది స్థాయి ఉద్యోగుల ఆత్మాభిమానం పట్ల సీఎంకున్న గౌరవాన్ని సూచిస్తున్నాయని పేర్కొన్నారు.

వెయ్యేళ్ల గుడి.. ఈ గతి పట్టించారు!


రాజగోపాల స్వామి ఆలయం


కూల్చేసినప్పటి ఆలయ పరిస్థితి


అభివృద్ధి పేరుతో తవ్వి పోగులేశారు

నిధుల కోసమే అని అనుమానాలు

సత్యవేడు/నాగలాపురం, ఆగస్టు 5 : చరిత్ర పట్ల మన నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంలా కనిపిస్తుంది నాగలాపురం మండలం టీపీపాళెంలోని ఈ శ్రీరాజగోపాల స్వామి ఆలయం. గోపురాలపై శిల్పాలు, శిల్పాలు చెక్కిన రాతి స్తంభాలు, సున్నపు మిశ్రమంతో తెల్ల బండలపై నిర్మించిన ఈ ఆలయం వెయ్యేళ్ల కిందటిదని చెబుతారు. కీ.శ.1100లో పల్లవరాజులు నిర్మించినట్లు ఆధారాలున్నాయంటారు. ధూపదీప నైవేద్యాలతో ఒకనాడు అలరారిన రాజగోపాలస్వామి ఆలయం మాన్యాలు మాయం కావడంతో ఆదరణ కరువై శిథిల స్థితికి చేరుకుంది. పాతబడిన ఆలయం మనకెందుకు కొత్త ఆలయం నిర్మించుకుందామని 2019లో గ్రామానికి చెందిన వైసీపీ నేత, ప్రస్తుత సర్పంచ్ పళణి ప్రతిపాదన చేశారు. దాతల సహకారంతో తానే కొత్త గుడి నిర్మిస్తానని చెప్పారు.శిథిలావస్థకు చేరిన వాహన గోపురం, ధ్వజస్తంభం, ప్రహారీలకు మరమ్మతులు చేయిస్తానని అనుమతుల కోసం దేవదాయశాఖకు 2019లో విన్నవించుకున్నారు. ఇంకేం.. అధికారంలో ఉన్నది తమ ప్రభుత్వమే కావడంతో ఆగమేఘాల మీద అనుమతులు


ఆలయంలో విగ్రహాలు

వచ్చేశాయి. అంతే ఆయన ఆలస్యం చేయకుండా పురాతన ఆలయంలో తవ్వకాలు మొదలు పెట్టేశారు. గోపురాలు కూల్చేశారు. ధ్వజస్తంభం తవ్వి తీసేశారు. కొత్త ఆలయం నిర్మించకపోగా ఉన్న పాత గుడినీ దాదాపుగా కూల్చేసి ఇలా మిగిల్చేశారు.


బావిలా మారిన ధ్వజస్తంభ ప్రాంతం

గుప్త నిధుల కోసమేనా?

టీపీపాళెంలోని శ్రీరాజగోపాల స్వామి ఆలయంలో గుప్తనిధులను వెలికి తీయడానికే ఇలా కూల్చేశారనే ప్రచారం ఈ ప్రాంతంలో జోరుగా సాగుతోంది. ఆలయ ప్రవేశ ద్వారం నుంచి, గర్భగుడి వరకు ఇష్టారీతిన జరిపిన తవ్వకాలను ఇందుకు సాక్ష్యంగా చూపుతున్నారు. మరమ్మతులకంటూ అనుమతులు పొందిన వారు ఆలయం చుట్టూ 20 అడుగుల ఎత్తు వరకు పరదాలతో కప్పేసి, రాత్రి వేళల్లో ఆలయంలో భారీ యంత్రాలతో తవ్వకాలు ఎందుకు జరపాల్సి వచ్చిందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ధ్వజస్తంభం, బలిపీఠం, గర్భగుడి దగ్గర ముప్పై, నలభై అడుగుల లోతు వరకు తవ్వకాలు ఎందుకు జరపాల్సిన వచ్చిందని ప్రశ్నిస్తున్నారు. నాలుగేళ్ల కిందట భారీ యంత్రాలతో తవ్వకాలు జరిపినపుడు, ఆ ధాటికి ఆలయ పరిసరాల్లోని నివాస గృహాలు వైబ్రేషన్‌కు గురయ్యాయని చెబుతున్నారు. ఆలయం కూల్చివేత వెనుక అప్పటి అధికార వైసీపీ బడా నేతలు కూడా ఉన్నట్లు ఆరోపణలున్నాయి. కడప జిల్లాకు చెందిన ఒక వైసీపీ నేత ఆలయంపై కన్నేసి, స్థానిక నేతలతో కలిసి అభివృద్ధి పేరుతో ఆలయంలో తవ్వకాలు జరిపి నిధులు దోచుకున్నారనే వదంతులు కూడా ఈ ప్రాంతంలో వినిపిస్తున్నాయి. అసలు వెయ్యేళ్ల చరిత్ర ఉన్న ఆలయాన్ని ఆర్కియాలజీ అనుమతి లేకుండా ఎలా కూల్చేశారన్నదే విచిత్రం.మరమ్మతుల పేరుతో అనుమతులిచ్చిన దేవాదాయ శాఖ, ఆలయంలో జరుగుతున్న తవ్వకాలను ఎందుకు పర్యవేక్షించలేదో అర్థం కాదు. కాగా ఈ విషయమై ఆలయ ఈవో లతను వివరణ కోరగా మరమ్మతులకోసం అనుమతులు పొందిన దాత పళణికి నోటీసులిచ్చామని తెలిపారు. ఆరు నెలల్లో ఆలయ పనులు పూర్తి చేయాలని ఆయనకు ఆదేశాలిచ్చామన్నారు. గడువులోగా పనులు పూర్తి కాకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.


శిథిలావస్థలో ఆలయం

ఫ్రీహోల్డ్ చేసిన అసైన్డ్ భూములపై పునఃపరిశీలన

పారిశ్రామిక, పర్యాటక రంగాలకు ప్రోత్సాహం

కలెక్టర్‌కు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం




అమరావతి సదస్సులో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఫ్రీహోల్డ్ చేసిన అసైన్డ్ భూములపై పునః పరిశీలన చేయాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్ సంజామల వెంకటేశ్వర్‌కు దిశానిర్దేశం చేశారు.సోమవారం అమరావతిలో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహించిన సదస్సులో ఆయన జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై సమీక్షించారు. ఇటీవల మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దగ్ధం ఘటన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా 22ఏనిషేధిత జాబితాలో వున్న అసైన్డ్ భూములను పెద్దఎత్తున ఫ్రీ హోల్డ్ చేయడం, రిజిస్ట్రేషన్లతో ఆ భూములు చేతులు మారిన ఉదంతాలు వెలుగు చూసిన సంగతి తెలిసిందే. ఈ రకమైన వ్యవహారాలు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎక్కువగా జరిగినట్టు వెల్లడి కావడంతో సదస్సులో సీఎం చంద్రబాబు ఈ అంశంపై దృష్టి సారించారు. జిల్లా వ్యాప్తంగా ఫ్రీహోల్డ్ చేసిన అసైన్డ్ భూములపై పునః పరిశీలన జరపాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆదేశించారు. పారిశ్రామిక, పర్యాటక రంగాలు జిల్లా అభివృద్ధికి ప్రధాన వనరులని సీఎం అభిప్రాయపడ్డారు. తిరుపతి జిల్లా చెన్నై-వైజాగ్ ఇండస్ట్రియల్ కారిడార్ పరిధిలోకి చేరినందున పరిశ్రమల అభివృద్ధికి అపారమైన అవకాశాలున్నాయన్నారు.ఆ దిశగా జిల్లాలో పారిశ్రామికవాడలను అభివృద్ధి చేసి, పెట్టుబడులు పెట్టేలా పారిశ్రామికవేత్తలను ఆకర్షించే ప్రయత్నం చేయాలని సూచించారు. ఇప్పటికే పెద్ద ఎత్తున జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు, పరిశ్రమలు జిల్లాలో వున్నందున కొత్త పరిశ్రమలను జిల్లాకు రప్పించడం పెద్ద కష్టం కాబోదన్నారు. అదే విధంగా పర్యాటక రంగ అభివృద్ధికి కూడా జిల్లాలో అవకాశాలు అధికంగా వున్నాయన్నారు. టెంపుల్, హెరిటేజ్, ఎకో టూరిజంలతో పాటు కొత్తగా జిల్లా పరిధిలోకి సముద్ర తీర ప్రాంతం, పులికాట్ సరస్సు వంటివి చేరినందున బీచ్ టూరిజం, వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధికి కూడా అవకాశమేర్పడిందన్నారు. ఈ వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రణాళికలు, ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్‌కు సూచించారు.

బీసీలకు ఆదరణ పనిముట్లు త్వరగా ఇవ్వాలి!

చిత్తూరు సహా పలు జిల్లాల్లో బీసీ చేతివృత్తి పనివారికి ఆదరణ పనిముట్లు ఇవ్వలేదని సీఎం చంద్రబాబు కలెక్టర్ల సదస్సులో ప్రస్తావించారు. వాటిని లబ్ధిదారులకు త్వరగా అందజేయాలని ఆదేశించారు. 2014-19 నడుమ తమ ప్రభుత్వంలో పలుచోట్ల బీసీ భవన్‌ల నిర్మాణం చేపట్టామని, అయితే ప్రభుత్వం మారడంతో గత ప్రభుత్వం చాలావరకూ వాటిని పూర్తి చేయలేదన్నారు. అలాంటివి గుర్తించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. గౌడ, ఈడిగ తదితర కులాలకు చెందిన పలు కుటుంబాలు కల్లు విక్రయించే వృత్తిలో కొనసాగుతున్నాయని గుర్తు చేసిన సీఎం కల్లు, మద్యం షాపుల్లో 15-20 శాతం షాపులు వారికే కేటాయించాల్సి వుందన్నారు. ఉచిత ఇసుక విధానంపై సమీక్షించిన సీఎం చంద్రబాబు రానున్న రోజుల్లో గ్రామ, వార్డు సచివాలయాల నుంచే ఇసుక బుకింగ్ సదుపాయం అందుబాటులోకి తెస్తామన్నారు. ప్రీ పెయిడ్ ట్యాక్సీ తరహాలో ఇసుక రవాణాకు సచివాలయాల్లోనే వాహనాలు బుకింగ్ చేసే సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. ఇంటికి ఇసుక చేరిందని వినియోగదారుడు ధృవీకరించాకే రవాణా రుసుం సంబంధిత ట్రక్కు ఆపరేటర్ల ఖాతాలో జమయ్యేలా సాఫ్ట్‌వేర్ రూపొందిస్తామన్నారు. ఈ సదస్సులో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు ప్రత్యక్షంగా పాల్గొనగా వీడియో కాన్ఫరెన్సు ద్వారా తిరుపతి కలెక్టరేట్ నుంచీ జాయింట్ కలెక్టర్ శుభమ్ బన్సాల్ పాల్గొన్నారు.


తిలక్ రోడ్డులో ప్రవహిస్తున్న నీళ్లు


కూరగాయల మార్కెట్లో ఇదీ పరిస్థితి


రోడ్డుపై నీటి ప్రవాహం

జోరు వర్షం

తిరుపతి నగరంలో సోమవారం రాత్రి మంచివర్షం కురిసింది. బంగాళఖాతంలో ఉపరితల ఆవర్తన ప్రభావంతో పగలంతా ఎండ తీవ్రత కొనసాగింది. రాత్రి దాదాపు గంటపాటు జోరు వర్షం కురిసింది. రోడ్లు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపించాయి. అండర్ బ్రిడ్జిల్లో నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఆర్టీసీ బస్టాండులో, కూరగాయల మార్కెట్‌లో నీరు నిలవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాతావరణం చల్లబడడంతో ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు.

- తిరుపతి అర్బన్



పొక్లయినర్ పడవెక్కింది

పొక్లయినర్ పడవెక్కిదేంటని విస్తుపోతున్నారా.. ఇరకందీవికి వెళ్లాలంటే ఇదొక్కటే దారి మరి..విషయంలోకి వస్తే..తడ మండలంలోని ఈ గ్రామానికి ఏటా వర్షాకాలమొస్తే పొలాల మీదకు ఉప్పుటేరు పోటెత్తుతుంది. రైతులు పంట నష్టపోతుంటారు. ఈ సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ భావించారు. ఉప్పుటేరు కట్టడికి పొర్లుకట్టలు ఏర్పాటు చేయాలని సంకల్పించారు. నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో పొర్లుకట్టల నిర్మాణానికి పొక్లయినర్ అవసరమైంది. సోమవారం భీములవారిపాళెం పడవలరేవు వద్ద నాటు పడవలో పొక్లయినర్‌ని ఎక్కించి ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని ఇరకందీవికి చేర్చారిలా..

- తడ

గత ప్రభుత్వం దగా చేసింది...

మా భూములను కబ్జా చేసింది


పట్టాదార్ పాసు పుస్తకాలను చూపుతున్న రౌతు సూరమాల గ్రామస్తులు

తిరుపతి(విద్య), ఆగస్టు 5: 'మా భూములను మాకు తెలియకుండానే లాగేసుకున్నారు... రికార్డుల్లో పేర్లు మార్చేశారు... ఒక్క పైసా కూడా నష్టపరిహారం ఇవ్వలేదు. మా గ్రామ సర్పంచి (వైసీపీ) మాయ మాటలు నమ్మి మోసపోయాం. తీరా ఇప్పుడు చూసుకుంటే... తాత ముత్తాతలనుంచి సాగుచేసుకుంటున్న భూ రికార్డుల్లో మాపేర్లే లేవు. మేమంతా పేద ఎస్సీ ఎస్టీ బీసీ కుటుంబాలకు చెందినవారం... మీరే న్యాయం చేయాలి' అంటూ తొట్టంబేడు మండలం రౌతుసూరమాల గ్రామ ప్రజలు వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డీఆర్వో పెంచల కిషోర్‌కు తమ గోడు వెళ్లబోసుకున్నారు. రౌతు సూరమాల గ్రామానికి చెందిన నిరుపేదలైన సుమారు 50 ఎస్సీ ఎస్టీ బీసీ కుటుంబాలకు కలిపి 100 ఎకరాలకు డీకేటీ పట్టాలు మంజూరు చేసి పట్టాదారు పాసు పుస్తకాలు కూడా గతంలో ఇచ్చారు. అయితే ఇండస్ట్రియల్ పార్క్‌కోసం 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం తొట్టంబేడు మండలంలో భూములను సేకరించింది. ఆ సందర్భంగా రైతులకు నష్టపరిహారం చెల్లిస్తూ భూములను టీడీపీ ప్రభుత్వం సేకరించింది. ఆ తరువాత వైసీపీ అధికారంలోకి వచ్చాక నష్ట పరిహారం చెల్లించాకే ప్రభుత్వం భూములను తీసుకుంటుందని రాజకీయ నాయకులు, అధికారులు చెబుతూ రావడంతో రైతులు ధైర్యంగా ఉండిపోయారు. అనుమానం వచ్చి ఇటీవల పరిశీలించుకుంటే భూ రికార్డుల్లో తమ పేర్లే వారికి ఆన్‌లైన్‌లో కనిపించలేదు. వారి భూములన్నీ ఏపీఐఐసీ పేరున ఉన్నట్టు, రైతులు ఆ భూములను ప్రభుత్వానికి అప్పగించినట్టు ఉంది. ఈ విషయమై సర్పంచిని సంప్రదించగా...అధికారులెవరికీ ఫిర్యాదు చేయొద్దని, త్వరలో నష్టపరిహారం వస్తుందని చెప్పినట్టు గ్రామస్తులు డీఆర్వోకు తెలియజేశారు. తమ భూములను తీసుకుంటున్నట్టు వైసీపీ ప్రభుత్వం తమకు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదని చెప్పుకొచ్చారు.కనీసం నష్టపరిహారం కూడా ఇవ్వకుండా... తమకు తెలియకుండా భూములను తీసేసుకోవడం ఏంటని ప్రశ్నించారు. తామంతా పేదలమని, ప్రభుత్వం ఇచ్చిన ఒకటి, రెండెకరాలే తమకు జీవనాధారమని, వాటిని అక్రమంగా కబ్జాచేసినవారిపై చర్యలు తీసుకుని తమకు నష్టపరిహారం ఇప్పించాలని కోరారు.

ఇసుక రీచ్‌లు దగ్గరలో ఏర్పాటు చేయాని ధర్నా



గూడూరు, ఆగస్టు 5: దూరప్రాంతాల నుంచి ఇసుక తీసుకురావాలంటే అదనపు భారం పడుతోందని సీఐటీయూ పేర్కొంది. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఈమేరకు ధర్నా చేసింది. అంతకుముందు ప్రదర్శన నిర్వహించింది. ఈ సందర్భంగా సీటూ నాయకులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల కడుపుకొట్టిందన్నారు. గూడూరు పరిసర ప్రాంతాల్లో ఇసుక లేకపోవడంతో అదనపు భారం పడుతోందన్నారు. నియోజకవర్గ పరిధిలో ఇసుక క్వారీలను ఏర్పాటు చేస్తే సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఉచితంగా ఇవ్వాలని ఆర్డీవో కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. శ్రీనివాసులు, శంకరయ్య, శివకుమార్, మధు, రఫీ, కృష్ణయ్య, నాగేంద్ర, టీవీరమణయ్య, సురేష్, ప్రసాద్, చంద్రయ్య పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ



గూడూరు అర్బన్, ఆగస్టు 5: స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్‌క్లబ్, ఆంధ్రమహిళా మండలి సహకారంతో దివ్యాంగులకు నిత్యావసరాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రోహిణి మాట్లాడుతూ ప్రతినెల దివ్యాంగులకు చేయూతనందించేలా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. డాక్టర్ తనూజ, స్నేహలత, శశిరేఖ, లక్ష్మీ, సుధీర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



పెళ్లకూరు, ఆగస్టు 5 : చావాలి పంచాయతీలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులను ఎంపీడీవో అన్నపూర్ణరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఉపాధిహామీ పనులను కల్పించాలని సిబ్బందికి సూచించారు. పంచాయతీ పరిధిలోని అన్నీ గ్రామాల్లో కూలీల సంఖ్య పెంచాలని.. పనుల కల్పనలో వెనుకబడిన ఫీల్డ్ అసిస్టెంట్‌లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనులు చేసే ప్రాంతంలో కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఈసీ భాస్కర్ తదితరులు ఉన్నారు.

స్మశానవాటికకు స్థలం కేటాయించాలని వినతి



ఆర్డీవో కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

గూడూరు, ఆగస్టు 5: రెండో పట్టణ పరిధిలో ముస్లింల స్మశానవాటికకు స్థలాన్ని కేటాయించాలని సీపీఐ నాయకులు కోరారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో కిరణ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సీపీఐ నాయకులు మాట్లాడుతూ ఇందిరమ్మకాలనీ, గాంధీనగర్, జగనన్నకాలనీ, టిడ్కోగృహాల్లో సుమారు 500 మంది కుటుంబాలు నివసిస్తున్నారన్నారు. దహనసంస్కారాలు చేసుకునేందుకు 4 కిలోమీటర్ల దూరం తీసుకువెళ్లాల్సివస్తుందన్నారు. కాలేషా, ప్రభాకర్, సీవీఆర్‌కుమార్, శశికుమార్, చంద్రయ్య, శుభాన్, నజీర్, జిలానీ పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

గూడూరు అర్బన్, ఆగస్టు 5: తల్లిపాలు బిడ్డకు పరిపూర్ణ ఆరోగ్యవంతమని అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నారు. సోమవారం స్థానిక రెండో పట్టణ పరిధిలోని సీతమ్మ పాఠశాలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముర్రుపాలు చిన్నారులలో వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయన్నారు. ఆరు నెలల వరకు తల్లిపాలు ఇస్తే బిడ్డలు ఆరోగ్యంగా ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో రాజేశ్వరి, సునీత, రమాదేవి, సుభాషిణి, హైమావతి, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం: నెలవల



రమేష్‌ను సన్మానిస్తున్న నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట, ఆగస్టు 5 : రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. టీడీపీ విజయం సాధించిన నేపథ్యంలో సైకిల్‌యాత్ర ద్వారా విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి వెళ్తున్న చిత్తూరుకు చెందిన రమేష్‌ను సోమవారం ఆయన పార్టీ కార్యాలయం వద్ద సన్మానించారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ రమేష్‌ను ఆదర్శంగా తీసుకొని ప్రతి కార్యకర్త పార్టీ కోసం కష్టపడి పనిచేయాలన్నారు. టీడీపీ నాయకులు నాగేంద్రరెడ్డి, రాజారెడ్డి, ధనంజయరెడ్డి, విజయకుమార్‌నాయుడు, గోపాల్‌రెడ్డి, చక్రపాణి, బాబు, కన్నెమ్మ తదితరులు ఉన్నారు.

కష్టించి పనిచేసిన వారికి జనసేనలో ప్రాధాన్యం

నాయుడుపేట, ఆగస్టు 5 : జనసేనలో ఆరంభం నుంచి కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు సముచితస్థానం లభిస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్ సోమవారం మీడియాకు చెప్పారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు నామినేటెడ్ పదవులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఎన్డీఏ కూటమిలో భాగస్వాములైన జనసేనకు నామినేటెడ్ పదవులు వారి అర్హత ప్రకారం దరఖాస్తు చేసుకోవచ్చాన్నారు. పార్టీ కార్యక్రమాలు, సంబంధించిన ఫోటోలు, వ్యక్తిగత సమాచారంతో నాయుడుపేటలోని కార్యాలయంలో అందజేయాలన్నారు.

మినీ గోకులాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిట్టమూరు, ఆగస్టు 5 : ప్రభుత్వం పశువుల మినీ గోకులాల ఏర్పాటుకు యూనిట్లు మంజూరు చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి సురేంద్రబాబు తెలిపారు. చిట్టమూరుకు 9, మల్లాం 8, గునపాడు 8 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. రెండు, నాలుగు, ఆరు పశువుల మినీ గోకులాలకు యూనిట్లు మంజూరు చేస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, దారిద్ర్య రేఖకు దిగువనున్న వారు, మహిళలు, అంగవైకల్యమున్నవారు, భూ సంస్కరణల లబ్ధిదారులు, చిన్న, సన్నకారు రైతులు యూనిట్ల ఏర్పాటుకు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తుతోపాటు ఆధార్‌కార్డు, ఉపాధి జాబ్‌కార్డు, స్థలం హక్కు పత్రం, బ్యాంక్ పాస్ బుక్ పత్రాలను జతపరచాలని వివరించారు.

భక్తుల బంగారు ఆభరణాల అపహరణ

● నాలుగు గంటల్లోనే నిందితురాలి పట్టివేత

తిరుమల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): భక్తుల నుంచి బంగారు ఆభరణాలను అపహరించిన ఓ మహిళను పోలీసులు పట్టుకున్నారు. వన్‌టౌన్ సీఐ విజయ్‌కుమార్ వివరాల మేరకు.. నెల్లూరుకు చెందిన మల్లీశ్వరి, నందేశ్వరుడు తిరుపతి కుమార్తె వద్దకు వచ్చారు. కుమార్తె, అల్లుడు పనిపై వెళ్లిన క్రమంలో వారు తిరుమలకు వచ్చారు. ఇంట్లో భద్రత ఉండదనే కారణంతో 230 గ్రాముల బంగారు ఆభరణాలను తిరుమలకు తీసుకువచ్చారు. అఖిలాండం వద్ద సేదతీరుతుండగా ఓ మహిళ బంగారు ఆభరణాల బాక్స్‌ను అపహరించుకెళ్లింది. కొంతసమయానికి గుర్తించిన మల్లీశ్వరి వెంటనే విజిలెన్స్ అధికారులు, సిబ్బంది సహకారంతో కమాండ్ కంట్రోల్ రూమ్‌కు చేరుకుని అఖిలాండం ఫుటేజ్‌ను పరిశీలించారు. మహిళ చోరీ చేసినట్టు స్పష్టంగా తెలిసింది. కర్ణాటక సత్రాల వద్ద ఆ మహిళను అదుపులోకి తీసుకుని ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

10న మెగా జాబ్‌మేళా



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ మురుగదాస్

గూడూరు, ఆగస్టు 5: స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 10న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మురుగదాస్ అన్నారు. సోమవారం స్థానిక కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాలో పలు ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. 7వ తరగతి నుంచి బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ వరకూ ఉత్తీర్ణులైన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. వివరాలను 9248748405, 9248748428 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.వేణుమాధవ్, సురేష్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరి, ఆగస్టు 5: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మిగిలిన సీట్ల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. సంస్థ ప్రిన్సిపల్ ఉమారాణి ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. డ్రాఫ్ట్స్‌మన్ సివిల్, ఫిట్టర్, మెషినిష్ట్, వైర్మెన్, మెకానిక్ , వెల్డర్ ట్రేడ్లలో చేరేందుకు ఐటీఐ.ఏపీ.జీవోవి.ఇన్ లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులు అర్హులన్నారు. ఏడాది కోర్సులో చేరేందుకు 10వ తరగతి ఫెయిలైన వారు కూడా అర్హులేనన్నారు. నమోదు చేసుకొన్న అభ్యర్థులు రిజిస్ట్రేషన్ నంబరుతో పాటు ఒరిజినల్ సర్టిఫికేట్లు(టెన్త్ మార్కుల లిస్ట్, ట్రాన్స్ఫర్, సడీ, క్యాస్ట్, ఇన్‌కం, 10వ తరగతి హాల్ టికెట్, ఆధార్‌కార్డు) రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలను ఐటీఐ పనివేళల్లో ఈనెల 26లోపు వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. వివరాలకు 9441850595 ఫోన్ నంబర్లో సంప్రదించాలన్నారు.

108 వాహనానికి తప్పిన ప్రమాదం



వీల్ బోల్ట్ వదిలేయడంలో ఆగిన వాహనం

సూళ్లూరుపేట, ఆగస్టు 5: 108 వాహనానికి ప్రమాదం తప్పింది. సోమవారం కొండూరు వద్ద పెట్రోల్ బంకులో డీజిల్ నింపుకొని ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు వెళ్తుండగా వినాయకుడి గుడి వద్ద వీల్ బోల్ట్ వదిలేసింది. దీంతో వాహనం ఆగిపోయింది. ఒకసారిగా శబ్ధం వచ్చి ముందుకు ఒరిగిపోవడంతో డ్రైవర్ అప్రమత్తమై వాహనాన్ని నిలిపివేయంతో ప్రమాదం తప్పింది. నెమ్మదిగా నడపడం వల్ల నియంత్రణ సాధ్యమైంది. అత్యవసర సమయంలో రోగులను తీసుకెళ్లేటప్పుడు ఇలాంటి సంఘటన జరిగితే చాలా ఇబ్బందులెదురయ్యేవి. ఇక్కడి 108 వాహనం తరచూ మరమ్మతులకు గురవుతుందని సిబ్బంది చెబుతున్నారు. 2016లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన వాహనమిది.

ఏడేళ్ల చిన్నారిపై లైంగిక దాడియత్నం

● నిందితుడ్ని పోలీసులకు అప్పగించిన స్థానికులు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 5 : ఏడేళ్ల చిన్నారిపై లైంగికదాడి యత్నానికి పాల్పడ్డాడో యువకుడు. పోలీసుల కథనం మేరకు పట్టణంలో సోమవారం ఇంట్లో ఒంటరిగా ఉన్న ఓ చిన్నారిపై స్థానిక యువకుడు లైంగిక దాడికి యత్నించాడు. చిన్నారి కేకలు వేయడంతో పక్కింటివారు చేరుకున్నారు. ఈలోగా ఆ యువకుడు వెళ్లిపోయాడు. కొంతసేపటి తరువాత అదే ప్రాంతంలో ఆ యువకుడు తిరుగుతుండడాన్ని స్థానికులు గుర్తించారు. పట్టుకుని దేహశుద్ధి చేశారు. పోలీసులకు అప్పగించారు. ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరి చేరుకొని వివరాలను నమోదు చేసుకున్నారు. పది రోజులుగా తమబిడ్డను ఆ యువకుడు వేధిస్తున్నట్లు బాధిత బాలిక తల్లి ఫిర్యాదులో పేర్కొంది. నిందితుడిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

72 మద్యం బాటిళ్ల పట్టివేత



పట్టుబడ్డ మద్యం బాటిళ్లతో సెబ్ సీఐ అరుణకుమారి

నాయుడుపేట టౌన్, ఆగస్టు 5 : అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ అరుణకుమారి తెలిపారు. పట్టణంలోని పాత బస్టాండ్‌కు సమీపంలో సోమవారం సాయంత్రం మోటారు సైకిల్‌పై ఇద్దరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా 72 మద్యం బాటిళ్లను తరలిస్తుండగా గుర్తించామన్నారు. వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

మూడు వాహనాల దగ్ధం



దొరవారిసత్రం, ఆగస్టు 5 : పోలిరెడ్డిపాళెం గ్రామంలో మస్తాన్ ఇంట్లో ఆదివారం రాత్రి మూడు మోటారు సైకిళ్లను గుర్తు తెలియని వ్యక్తి దగ్ధం చేశాడు. కాలిపోయిన వాహనాల్లో బైక్, రెండు స్కూటీలు ఉన్నాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఐటీఐ మూడో విడత అడ్మిషన్లకు దరఖాస్తులు

కోట, ఆగస్టు 5 : చిట్టేడు బాలికల ఐటీఐలో మూడవ విడత అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అద్దంకి నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో ఈనెల 26లోగా దరఖాసు చేసుకుని సర్టిఫికేట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. బ్రాంచిల వారీగా ఎలక్ట్రానిక్ మెకానిక్ 3, మెకానిక్ డీజిల్ 2, వెల్డర్ 7 వంతున ఖాళీలున్నాయన్నారు. మరిన్ని వివరాలకు 8008583423 - 8498066674 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

పులికాట్‌కు మంచి రోజులు

● పర్యాటక శోభ దిశగా అడుగులు
● కలెక్టర్ సమీక్షతో ఆశల చిగురింత

సూళ్లూరుపేట, ఆగస్టు 5: కూటమి ప్రభుత్వ సారథ్యంలో నియోజకవర్గంలో పర్యాటక రంగానికి పూర్వ వైభవం రానుంది. రెండురోజుల క్రితం కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించడంతో ఆశలు చిగురించాయి. పులికాట్ ముఖద్వారాల పూడికతీత, పర్యాటక రంగ అభివృద్ధి, తీర ప్రాంత రహదారులు, మౌలిక వసతుల కల్పన లాంటి అంశాలను ఆయన చర్చించారు. ఈదిశగా అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే పులికాట్ ముఖద్వారాల పూడికతీతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.97.09 కోట్లు సాగరమాల నుంచి నిధులు సమకూర్చాయి. తాజాగా ముఖద్వారాల పూడికతీతపై కదలిక రావడంతో మత్స్యకారుల కుటుంబాలు ఆనందం వ్యక్తంచేస్తున్నాయి.

పూడికతీతతో పూర్వవైభవం

వలస పక్షుల విహార కేంద్రంగా విశేష చరిత్ర ఉన్న పులికాట్ సరస్సులో ఒకప్పుడు ఏడాది పొడవునా నీరుండేది. ఏటా శీతాకాలంలో 117 రకాల విదేశీ పక్షులు వలస వచ్చి వెళ్తుంటాయి. దొరవారిసత్రం వద్ద నేలపట్టులో ఇవి విడిది చేస్తుంటాయి. సరస్సుకు, సముద్రానికి మధ్య కొండూరుపాలెం, రాయదొరువు సమీప ముఖద్వారాల వద్ద ఇసుక మేటలు పేరుకుపోయాయి. దీంతో సముద్రపు నీరు సరస్సుకు రావడం లేదు. ఈక్రమంలో వలస పక్షుల సంఖ్య కూడా ఏటా తగ్గిపోతోంది. ముఖద్వారాల పూడికతోనే సరస్సుకు పూర్వ కళ వస్తుంది.

ఆగిపోయిన పక్షుల పండుగ

పులికాట్‌లోకి వలస పక్షులు రావడంతో టీడీపీ ప్రభుత్వం 2001లో పక్షుల పండుగను ప్రారంభానికి శ్రీకారం చుట్టింది. దీంతో ఈ ప్రాంతానికి అప్పటి మంచి గుర్తింపు వచ్చింది. నిధులు మంజూరు చేసి అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్కసారి మాత్రమే ఈ పండగ నిర్వహించి చేతులెత్తేసింది. కూటమి ప్రభుత్వం రావడంతో పర్యాటకరంగానికి మళ్లీ ఊపిరి పోస్తుందని ప్రజలు ఎదురుచూస్తున్నారు.



అట్టకానితిప్ప వద్ద పర్యావరణ విజ్ఞాన కేంద్రం

పద్ధతులు మార్చుకోకపోతే చర్యలు : ఎమ్మెల్యే విజయశ్రీ



అంగన్‌వాడీ సిబ్బందితో మాట్లాడుతున్న విజయశ్రీ

తడ, ఆగస్టు 5 : గతంలో మాదిరి కాకుండా నిబంధనల ప్రకారం పనిచేయకుంటే చర్యలు తప్పవని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అంగన్‌వాడీ సిబ్బందిని హెచ్చరించారు. సోమవారం ఉదయం చేనిగుంటలోని అంగన్‌వాడీ పాఠశాలను, స్థానిక ఐటీఐ కళాశాలను ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. 10 మంది చిన్నారులు హాజరైనట్లుగా పట్టికలో నమోదుచేసి ఉండగా అందుకు భిన్నంగా ఏడుగురే ఉన్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలామృత బస్తాలను ఎలుకలు కొట్టివేసినా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌కు ఫోన్‌చేశారు. అంగన్‌వాడీ పాఠశాల భవనం శ్లాబు పెచ్చులూడిపోతున్నా పట్టించుకోకపోవడం తగదన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన విధంగా పనిచేయాలనుకుంటే కుదరదన్నారు. ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఫిర్యాదులు అందడంతో అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలిస్తున్నామన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాల స్థానంలో కొత్తవి నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు ఐటీఐ కళాశాలలో సౌకర్యాలపై ఆరాతీశారు. ఎమ్మెల్యేతోపాటు ఎంపీడీవో విజయ్‌కుమార్, హౌసింగ్ ఏఈ సత్యనారాయణ, టీడీపీ నాయకులు మురళీరెడ్డి, బొమ్మన పళణి, శ్రీకాంత్‌రెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు. సైడ్ కాలువలు నిర్మించాలని గ్రామస్థులు విజయశ్రీని కోరారు.

మండలాల్లో తహసీల్దార్ల బాధ్యతల స్వీకారం

బాలాయపల్లి, ఆగస్టు 5: మండల తహసీల్దార్‌గా కేవీఆర్‌వీ ప్రసాదరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాలాయపల్లిలో పనిచేసిన పుల్లారావు సొంత జిల్లాకు బదిలీ అయ్యారు. తాజాగా ఆయన స్థానంలో నియమితులైన ప్రసాదరావు ఇప్పటివరకూ నెల్లూరు జిల్లాలో పనిచేశారు. **వెంకటగిరిటౌన్:** తహసీల్దార్‌గా మునిలక్ష్మీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె బాపట్ల నుంచి ఇక్కడకు బదిలీ అయ్యారు. గతంలో డక్కిలి తహసీల్దార్‌గా పనిచేశారు. ప్రజా సమస్యలే ధ్యేయంగా పనిచేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. **నాయుడుపేట టౌన్:** తహసీల్దారుగా గీతావాణి నియమితులయ్యారు. సోమవారం ఆమె బాధ్యతలను చేపట్టారు. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం నుంచి వచ్చారు. **ఓజిలి :** తహసీల్దార్‌గా పద్మావతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం రెవెన్యూ అధికారులతో సమావేశం అయ్యారు. **చిట్టమూరు:** తహసీల్దార్‌గా ఐఎస్ ప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాసశర్మ సొంత జిల్లాకు బదిలీపై వెళ్లిపోవడంతో ఆయన స్థానంలో ప్రసాద్ నియమితులయ్యారు.

కోస్టల్ కారిడార్‌లో 424 ఎకరాల సర్వే పూర్తి



తీగలపాళెం- గున్నంపడియ గ్రామాల మధ్య సర్వేలో అధికారులు, రైతులు

కోట, ఆగస్టు 5 :కొత్తపట్నం పంచాయతీలో చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ భూముల సర్వే లో భాగంగా సోమవారం నాటికి 424 ఎకరాల సర్వే పూర్తి చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కోస్టల్ కారిడార్ భూములకు సంబంధించి 444 ఎకరాల సర్వేకు గత నెల 25 నుండి కొత్తపట్నం పంచాయతీలో మూడు బృందాలు పనిచేస్తున్నాయి. ముగ్గురు డిప్యూటీ తహసీల్దార్లు, ముగ్గురు ఆర్ఐలు, నలుగురు వీర్వోలు, ఆరుగురు సర్వేయర్లు, పలువురు వీఆర్‌ఏల సర్వే పనుల్లో నిమగ్నమయ్యారు. తీగలపాళెం, గున్నంపడియా, యమదిన్నెపాళెం గ్రామాల సమీపంలోని 20 ఎకరాలు తమకు ఉన్నాయంటూ చిల్లకూరు మండల రైతులు అభ్యంతరాలు వ్యక్తంచేశారు. మంగళవారం సాయంత్రంకల్లా పెండింగ్‌లో ఉన్న 20 ఎకరాల్లో సర్వే పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

నిషేధిత భూముల్లో నిర్మాణాలు ఆపాలని ఆందోళన



కోట, ఆగస్టు 5 : నిషేధిత భూముల్లో అక్రమ కట్టడాలు ఆపాలంటూ గూడలి అరుంధతీయవాడ వాసులు సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వీరు మాట్లాడుతూ గూడలి పంచాయతీ పరిధిలో సుమారు 25 ఎకరాల భూములు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఆ భూములన్నీ టీటీడీ కళ్యాణ మండపం సమీపంలో ఉన్నాయన్నారు. గత ప్రభుత్వంలో ఇందులో ఎవరూ ప్రవేశించరాదంటూ నిషేదం విధించిందన్నారు. కొంతమంది నిషేధాన్ని లెక్కచేయకుండా అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారన్నారు. తక్షణ చర్యలు తీసుకోవాలని వారు నినాదాలుచేశారు. ఇన్‌చార్జి తహసీల్దారు మల్లిఖారునరావును కలిశారు.

నలుగురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

● 12 దుంగలు, రెండు బైక్‌ల స్వాధీనం



మంగళం, ఆగస్టు 5: నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి.. 12 దుంగలు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఆర్‌ఐ చిరంజీవులుకు చెందిన ఆర్‌ఎస్‌ఐ నరేష్ టీమ్ స్థానిక అటవీశాఖ అధికారుల సాయంతో సోమవారం వెంకటగిరి ఫారెస్టు రేంజ్ డక్కిలి అటవీప్రాంతం వైపు, సీసీ కండ్రిగ వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను తనిఖీలు నిర్వహించారు. తెల్లవారుజామున వెంకటగిరి హిల్స్ వద్ద రెండు బైక్‌లపై కొందరు వ్యక్తులు కనిపించారు. వారిని చుట్టుముట్టగా పారిపోయే ప్రయత్నం చేశారు. వెంబడించి నలుగురిని పట్టుకున్నారు. వెంకటగిరి మండలానికి చెందిన వెంకటేష్(44), పారవేలు పెంచలయ్య(42), త్రిపురాంతపల్లి వెంకటేష్(44), రేణిగుంట మండలానికి చెందిన కొల్లంగుంట సురేష్‌బాబు(39)గా గుర్తించారు. విచారించి, వారు దాచి ఉంచిన 12ఎర్రచందనం దుంగలను, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. పరారైనవారి కోసం గాలిస్తున్నారు. .

తల్లిపాల వారోత్సవాల ర్యాలీ



కోట, ఆగస్టు 5 : చిట్టేడు, కోట పట్టణ పరిధిలోని రవినగర్ గిరిజన కాలనీలలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. సీడీపీవో మునికుమారి, సూపర్ వైజర్లు కవిత, కృష్ణమ్మల ఆధ్వర్యంలో తల్లిపాల విశిష్ఠతను తెలుపుతూ గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు డాక్టర్ నాగరాజు, హెల్త్ సూపర్ వైజర్ ఎలిజబెత్, ఏఎన్ఎం శైలజ, విజయలక్ష్మి, మమత, లక్ష్మీ, సుందరమ్మ, పెంచలమ్మ పాల్గొన్నారు.

బైకుతో గేదెను ఢీకొట్టి వ్యక్తి మృతి



సంఘటనా స్థలంలో మురళి మృతదేహం

దొరవారిసత్రం,ఆగస్టు 5: మానేరి వద్ద ఆర్‌అండ్‌బీ రహదారిపై బైకుతో గేదెను ఢీ కొట్టి మదనంబేటి మురళి(38) అనే వ్యక్తి మృతి చెందాడు. సింగనాలత్తూరుకు చెందిన ఇతడు మాంబట్టు సెజ్‌లోని అపాచీ కంపెనీలో పనిచేసేవాడు. సోమవారం రాత్రి డ్యూటీ ముగించుకుని బైకుపై స్వగ్రామం వస్తున్నాడు. మానేరి వచ్చేసరికి పొలం నుంచి ఓ గేదె అడ్డుగా వచ్చింది. దీంతో చీకటిలో గేదెను ఢీ కొట్టాడు. మురళి కిందపడి మురళి అక్కడికక్కడే మృతి చెందాడు. గేదె కూడా ప్రాణాలు కోల్పోయింది. పోలీసులు మురళి మృతదేహన్ని సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు అభినందన



కోట, ఆగస్టు 5 : విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నావల్ ఎన్‌సీసీ క్యాడెట్లను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డిలు షీల్డ్‌లు, మెమెంటోలతో అభినందించారు. గత నెల 18 నుంచి 29వ తేదీ వరకు ముంబయిలో జాతీయస్థాయి క్యాంప్ జరిగింది. ఇంజనీరింగ్ విద్యార్థులు ఎం. దుర్గాభవానీ, వి. భానుప్రకాష్‌లు పాల్గొని ప్రతిభాపాటవాలు కనబరిచారని డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఒకరి అరెస్ట్

చిల్లకూరు, ఆగస్టు 5: చిత్తవరం కొత్తపాళెంకు చెందిన టీడీపీ కార్యకర్త గోపాల్‌పై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో వంశీకృష్ణ అనే వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో క్రియాశీలకంగా వ్యవహరించాడని అక్కసుతో మే 14న గోపాల్‌పై వైసీపీ కార్యకర్తలు దాడి చేశారు. హత్యాయాత్నానికి పాల్పడిన ఈ సంఘటనకు సంబంధించి విష్ణువర్ధన్‌రెడ్డి, కాంత్రికుమార్, దిలీప్‌కుమార్, చెంచయ్యలపై పోలీసులు వెంటనే కేసు నమోదు చేశారు. వారని అరెస్ట్ చేశారు. తాజాగా వంశీకృష్ణకు కూడా సంబంధం ఉన్నట్లు గుర్తించి సోమవారం అరెస్ట్ చేశారు.

మాజీ ఎంపీ నెలవలకు సత్కారం

పెళ్లకూరు, ఆగస్టు 5 : నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యాన్ని మొదలియార్ సంఘం నాయకులు సోమవారం సత్కరించారు. సంఘం జిల్లా నేతలు కందమూడి శివకుమార్, కందమూడి పళని తదితరులు సత్కరించిన వారిలో ఉన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.90 కోట్లు

తిరుమల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.90 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి, సోమవారం ఉదయం ప్రకటించింది.

టీటీడీకి రూ.11.22 లక్షల విరాళం

టీటీడీకి చెందిన ట్రస్టుకు సోమవారం రూ.11.22 లక్షలు విరాళంగా అందింది. చంద్రగిరి మండలం బుచ్చినాయుడుపల్లెకు చెందిన దామరపాటి శంకర్, మురళి ఈ విరాళాన్ని అందజేశారు.

సర్పంచ్ చొరవతో ఎల్‌ఈడీ వెలుగులు

పెళ్లకూరు, ఆగస్టు 5 : ఓ సర్పంచ్ సొంత నిధులు వెచ్చించి గ్రామంలో ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో పంచాయతీలకు పైసా కూడా విడుదల చేయలేదు. దీంతో అభివృద్ధి పడకేసింది. ఈ క్రమంలో జీలపాటూరు సర్పంచ్ కందమూడి శివకుమార్ ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా గత వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిన పంచాయతీ నిధులపె పలు పోరాటాలు చేశారు. ఇటీవల ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడంతో పంచాయతీ అభివృద్ధిపై ఆశలు చిగురించాయి. కూటమి ప్రభుత్వంపై విశ్వాసంతో శివకుమార్ తమ పంచాయతీలో నిధులు లేకపోయినా సొంతంగానే కొన్ని పనులు మొదలు పెట్టారు. జీలపాటూరు నుంచి చిల్లకూరు వరకు గల 1.5 కిలోమీటర్ల మేర విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించారు. వీటికి ఎల్‌ఈడీ లైట్లు కూడా అమర్చించారు. జీలపాటూరుతో పాటు దళితవాడ, దొడ్లవారిమిట్ట, గిరిజన కాలనీల్లో సుమారు 400 ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేయించారు. ఎల్‌ఈడీ కాంతులు విరాజల్లుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



జీలపాటూరులో రాత్రి వేళ ఎల్‌ఈడీ కాంతులు